నేటి దిక్సూచి

www.netidiksuchi.com

తెలుగు దినపత్రిక

TGTEL/25/A3190

ప్రచురణ. రంగారెడ్డి, సంపుటి:01 సంచిక :144 ఎడిటర్ పి. అలివేలు పేజిలు : 04, వెల. 2రూ/ ఆదివారం- 20 - సెప్టెంబర్ - 2026

భూటాన్‌లో భూకంపం.. 4.9 తీవ్రతతో కంపించిన భూమి.. అసోంలోనూ ప్రకంపనలు

- భూటాన్ ఈశాన్య ప్రాంతంలో శనివారం సాయంత్రం 4.01 గంటలకు భూకంపం సంభవించింది.
- ఈశాన్య భూటాన్‌లోని అనేక ప్రాంతాల్లో ఈ భూకంపం నమోదైంది.

ఢిల్లీ : భూటాన్‌లో శనివారం భూకంపం సంభవించింది. 4.9 తీవ్రతతో భూమి కంపించింది.

కీలక బిల్లుపై అమెరికా అధ్యక్షుడి సంతకం.. భారత్, చైనాలపై సుంకాలకు ట్రంప్‌కు ఫుల్ పవర్..!

- రష్యా, ఇరాన్, చైనా, భారత్ లను ఒకేసారి దెబ్బతీసే బిల్లుపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సంతకం చేశారు.
- భారత్ చైనా తో సహా 10 దేశాలు ఆంక్షల పరిధిలోకి వచ్చాయి.

ఢిల్లీ : దాంతో రష్యా, ఇరాన్ లపై ఆంక్షలను విధించేందుకు, వాటితో వాణిజ్యం కొనసాగిస్తోన్న భారత్, చైనాల పై సుంకాల మోత మోగించేందుకు అధ్యక్షుడికి అధికారం దఖలు పడింది. 'ద లిండ్సే ఓ గ్రాహం శాంక్షనింగ్ రష్యా అండ్ ఇరాన్ చట్టం-2026' పేరుతో తీసుకొచ్చిన బిల్లుకు బుధవారం సభ 262-159 ఓట్లతో ఆమోదం తెలిపిన సంగతి తెలిసిందే. ఈ బిల్లును గత నెలలోనే సెనెట్ ఆమోదించింది. ఇప్పుడు ట్రంప్ సంతకం చేయడంతో చట్టరూపం దాల్చింది. దాంతో భారత్ చైనా తో సహా 10 దేశాలు ఆంక్షల పరిధిలోకి వచ్చాయి. భారత్ అమెరికాకు ఎగుమతి చేసే వస్తువులపై ట్రంప్ సర్కార్ భారీగా సుంకాలు విధించనుంది. ఈ చట్టంపై ఇప్పటికే భారత్ స్పందించింది. రష్యాపై ఆంక్షలను, తమపై సుంకాలను విధిస్తే అమెరికాతో ద్వైపాక్షిక సంబంధాలకు ముప్పు తప్పదని భారత్ హెచ్చ రించింది. అమెరికా చర్యను చైనా తిరస్కరించింది. మిగతా..2లో

స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాలతో యువతకు కొత్త అవకాశాలు

రోజ్‌గార్ మేళాలో ప్రధాని మోదీ

- 20వ రోజ్‌గార్ మేళాలో 51 వేలకు పైగా నియామక పత్రాల పంపిణీ
- దేశవ్యాప్తంగా 45 ప్రాంతాల్లో నిర్వహించిన ఉద్యోగ మేళా

ఢిల్లీ : 2047నాటికి అభివృద్ధి చెందిన దేశంగా మారాలనే లక్ష్యం దిశగా భారత్ అడుగులు వేస్తోందని, ఇందులో యువత పాత్ర చాలా కీలకమని ప్రధాని నరేంద్ర మోదీ తెలిపారు. భారత్ వివిధ దేశాలతో కుదుర్చుకుంటున్న స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాలు (ఎఫ్‌టీఏలు) దేశ యువతకు కొత్త కెరీర్ అవకాశాలకు మార్గం సుగమం చేస్తున్నాయని అన్నారు. కొత్త మార్కెట్లకు మిగతా..2లో

ఇది ప్రకృతి తెచ్చిన కరవు కాదు, ముమ్మాటికీ కాంగ్రెస్ మార్క్ కరవు

- శ్రీశైలం నుంచి 84 టీఎంసీలు వాడామన్నది పచ్చి అబద్ధం
- గత మూడేళ్లలో ఏపీ 718, తెలంగాణ కేవలం 216 టీఎంసీలే వాడిందన్న హరీశ్ రావు
- రాష్ట్ర చరిత్రలోనే ఈ ఏడాది అత్యల్పంగా కృష్ణా జలాల వినియోగం
- నీళ్లు, మోటార్లు ఉన్నా ప్రభుత్వం వాడుకోలేకపోయిందని విమర్శ

వరంగల్ కొత్త ఎయిర్‌పోర్టుకు పేరు సూచించండి

- వరంగల్ మామునూరులో రానున్న కొత్త ఎయిర్‌పోర్టుకు ఏం పేరు పెట్టాలో సూచించాలని రేవంత్‌రెడ్డి కోరారు.
- మామునూరు విమానాశ్రయం ఏర్పాటు కోసం చురుగ్గా జరుగుతున్న ప్రక్రియలపై పత్రికల్లో వచ్చిన కథనాలకు ఎక్స్‌లో సీఎం పోస్ట్ చేశారు.

హైదరాబాద్ : వరంగల్ మామునూరు విమానాశ్రయం ఏర్పాటుకు చేపడుతున్న చర్యలు కీలక దశకు చేరుకున్నాయి. అనుమతుల దగ్గర నుంచి భూసేకరణ, సాంకేతిక పరమైన పరిశీలన దశలను దాటుకొని నిర్మాణ పనులను 3 ప్యాకేజీలుగా చేపట్టేందుకు ఎయిర్‌పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియా నిర్ణయించింది. ఇప్పటికే 2 ప్యాకేజీల పనులకు వేర్వేరుగా టెండర్లు పిలిచి ప్రక్రియను పూర్తి చేసిన విషయం తెలిసిందే.

కొత్త గేట్‌వే విమానాశ్రయం

మామునూరులో రానున్న మిగతా..2లో

వికసిత్ భారత్ లక్ష్యంలో తెలంగాణ కీలక పాత్ర

- తెలంగాణ ఆర్థికాభివృద్ధిపై ప్రభుత్వం భారీ లక్ష్యాలను నిర్దేశించుకుంది.
- 2047 నాటికి రాష్ట్రాన్ని 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దడంతో పాటు..
- దేశ ఆర్థిక వ్యవస్థలో తెలంగాణ వాటాను 5 శాతం నుంచి 10 శాతానికి పెంచే దిశగా ప్రణాళికలు రూపొంది స్తున్నట్లు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క తెలిపారు.

హైదరాబాద్, సెప్టెంబర్ 19: వికసిత్ భారత్ లక్ష్య సాధనలో తెలంగాణ మిగతా..2లో

ఇంటర్ బోర్డులో డిజిటలైజేషన్, రిటైర్మెంట్ వయోపరిమితి పెంపు

లోకేశ్ నివాసంలో ఇంటర్ బోర్డు పాలకవర్గం సమావేశం

1978 నుంచి జారీ చేసిన ఇంటర్ సర్టిఫికెట్లను డిజిటలైజ్ చేయాలని నిర్ణయం

ఉద్యోగుల రిటైర్మెంట్ వయసు 60 నుంచి 62కి పెంచాలని తీర్మానం

అమరావతి : ఆంధ్రప్రదేశ్ ఇంటర్మీడియట్ విద్యారంగంలో పారదర్శకత, జవాబుదారీతనం పెంచడమే లక్ష్యంగా వైవిధ్యమైన సంస్కరణలకు తెరలేపారు. ఉండవల్లిలోని తన నివాసంలో రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ అధ్యక్షతన జరిగిన ఇంటర్ బోర్డు 78వ పాలకవర్గ సమావేశంలో విద్యార్థుల భవిష్యత్తుతో పాటు ఉద్యోగుల సంక్షేమాన్ని పరిగణనలోకి తీసుకుంటూ అనేక కీలక నిర్ణయాలకు ఆమోద ముద్ర వేశారు. నకిలీ సర్టిఫికెట్ల అక్రమాలకు శాశ్వతంగా ముగింపు పలకాలనే దృఢ సంకల్పంతో 1978 నుంచి జారీ చేసిన ఇంటర్మీడియట్ విద్యార్హత పత్రాలన్నింటినీ సమగ్రంగా డిజిటలైజ్ చేయాలని ప్రతిపాదించారు. భద్రతను మరింత కట్టుదిట్టం చేసేందుకు మిగతా..2లో

దానం నాగేందర్‌పై కోర్టు తీర్పు... కేసీఆర్‌కు చెంపపెట్టు అన్న మహేశ్ కుమార్ గౌడ్

తెలంగాణలో పార్టీ ఫిరాయింపులను ప్రోత్సహించింది కేసీఆరేనని విమర్శ

ప్రభుత్వాలను కూల్చివేయడం బీజేపీకి అలవాటుగా మారిందని ఆగ్రహం

దేశంలో ప్రజాస్వామ్య వ్యవస్థను బీజేపీ నాశనం చేస్తోందని మండిపాటు

ఖైరతాబాద్ అసెంబ్లీ స్థానం కాంగ్రెస్‌దేనని ధీమా

హైదరాబాద్: దానం నాగేందర్‌పై అనర్హత పిటిషన్ కేసులో కోర్టు ఇచ్చిన తీర్పు బీఆర్ఎస్, కేసీఆర్‌కు చెంపపెట్టు లాంటిదని టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ వ్యాఖ్యానించారు. ఢిల్లీ పర్యటనలో ఉన్న ఆయన శనివారం మీడియాతో మాట్లాడుతూ, తెలంగాణలో పార్టీ ఫిరాయింపుల దుష్ట సంస్కృతిని ప్రవేశపెట్టిందే కేసీఆర్ అని తీవ్రంగా విమర్శించారు. కోర్టు తీర్పును స్వాగతిస్తున్నామని, ఎన్నిక జరిగితే ఖైరతాబాద్ అసెంబ్లీ స్థానం కాంగ్రెస్‌దేనని ఆయన ధీమా వ్యక్తం చేశారు. "గతంలో టీడీపీ టికెట్‌పై గెలిచిన తలసాని శ్రీనివాస్ యాదవ్‌ను, మిగతా..2లో

మోదీ, గడ్కరీలకు ధన్యవాదాలు తెలిపిన పవన్ కల్యాణ్

- కొప్పర్తి-కడప బైపాస్ రహదారికి రూ. 304 కోట్లు కేటాయించిన కేంద్రం
- రాష్ట్రాభివృద్ధికి కేంద్రం ఎంతో సహకరిస్తోందన్న పవన్ కల్యాణ్
- ఈ ప్రాజెక్టు కారణంగా రాయలసీమలో పెట్టుబడులకు అనుకూలమైన వాతావరణం ఏర్పడుతుందని వెల్లడి

అమరావతి : కడప జిల్లాలోని కొప్పర్తి ఇండస్ట్రియల్ కారిడార్ ను కడప బైపాస్‌తో అనుసంధానించే

నా జీవితం ధన్యమైంది - మీరు ఉండే ఇళ్లపై ఇక సర్వహక్కులు మీవే

- విశాఖలో ప్రభుత్వ స్థలాల్లో ఇళ్లు కట్టుకుని నివసిస్తున్న 28వేలకుపైగా పేదలకు వారి ఇంటిపై శాశ్వత హక్కు కల్పిస్తూ పట్టాలను చంద్రబాబు అందించారు.
- లబ్ధిదారులకు స్వయంగా పట్టాలు అందించి సుభాకాంక్షలు తెలియజేశారు.
- పేదలకు వారి ఇంటిపై శాశ్వత హక్కు కల్పిస్తూ పట్టాలను అందించిన సీఎం చంద్రబాబు

అమరావతి : కూడు, గూడు, గుడ్డ అనే ఎన్టీఆర్ నినాదాన్నే తాము విధానంగా మార్చుకుని పేదలందరికీ నివాస వసతి కల్పిస్తున్నామని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. విశాఖలో ప్రభుత్వ స్థలాల్లో ఇళు కట్టుకుని నివసిస్తున్న 28 వేలకుపైగా పేదలకు వారి ఇంటిపై శాశ్వత హక్కు కల్పిస్తూ పట్టాలను చంద్రబాబు అందించారు. లబ్ధిదారులకు స్వయంగా పట్టాలు అందించి సుభాకాంక్షలు తెలియజేశారు. మిగతా..2లో

స్థానిక ఎన్నికల్లో కూటమిదే విజయం.. 100 శాతం స్ట్రైక్ రేట్ ఖాయం

- ఎన్ని సీట్లలో పోటీ చేస్తున్నామనేది ముఖ్యం కాదన్న మనోహర్
- కచ్చితంగా విజయం సాధించే స్థానాల్లో పోటీ చేయడమే ముఖ్యమని వ్యాఖ్య
- పవన్ కల్యాణ్ పూర్తి స్థాయిలో అందుబాటులోకి రానున్నారని వెల్లడి

అమరావతి: రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి విజయదుందుభి మోగిస్తుందని, వందకు వంద శాతం స్ట్రైక్ రేట్‌తో విజయాలు సాధిస్తామని ఏపీ మంత్రి నాదెండ్ల మనోహర్ ధీమా వ్యక్తం చేశారు. విశాఖపట్నంలో ఈరోజు పర్యటించిన ఆయన పార్టీ కార్యకర్తలు, నాయకులతో సమావేశమై మాట్లాడారు. అభ్యర్థుల ఎంపికలో ఏవైనా పొరపాట్లు లేదా సమస్యలు ఎదురైతే వెంటనే పార్టీ అధిష్ఠానం మిగతా..2లో

మొదటి పేజి తరువాయి

స్థానిక ఎన్నికల్లో కూటమిదే విజయం..

100 శాతం స్ట్రైక్ రేట్ ఖాయం

దృష్టికి తీసుకురావాలని సూచిస్తూ, స్థానిక వార్డుల వారీగా బలమైన నాయకత్వాన్ని సిద్ధం చేసుకోవాలని పిలుపునిచ్చారు. ఎన్ని సీట్లలో పోటీ చేస్తున్నామనే సంఖ్య కంటే, గెలిచే బలం ఉన్న స్థానాల్లో నిలబడి కచ్చితమైన విజయం సాధించడమే ప్రాధాన్యమని స్పష్టం చేశారు. జనసేన పార్టీ అధినేత, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఇవాళ్టి నుంచి పూర్తిస్థాయిలో ప్రజలకు అందుబాటులోకి రానున్నారని నాదెండ్ల మనోహర్ వెల్లడించారు. రాజకీయాల్లో అనుభవమే అసలైన పాఠమని పేర్కొంటూ, జీవీఎంసీ పరిధిలో గతంలో గెలిచిన, రెండో స్థానంలో నిలిచిన ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. కేవలం టికెట్ వస్తే సరిపోదని... ప్రజల అవసరాలు, స్థానిక సమస్యల పరిష్కారం కోసం కేడర్ నిరంతరం శ్రమించాలని నిర్దేశించారు. టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి ఐక్యత వల్లే రాష్ట్రంలో పెట్టుబడిదారులకు కొండంత భరోసా లభించిందని, ఉత్తరాంధ్రకు వస్తున్న భారీ ప్రాజెక్టులే దీనికి నిదర్శనమని చెప్పారు. జనసేన పార్టీ ఎల్లప్పుడూ ప్రజల ప్రయోజనాల కోసమే పనిచేస్తుందని తెలిపారు.

మోదీ, గడ్కరీలకు ధన్యవాదాలు తెలిపిన పవన్ కల్యాణ్

నూతన రహదారి నిర్మాణ ప్రాజెక్టుకు కేంద్ర ప్రభుత్వం పచ్చజెండా ఊపింది. ఈ ప్రాజెక్టు మంజూరుతో పాటు రూ. 304.44 కోట్ల నిధులను కేటాయించినట్లు కేంద్ర రహదారులు, ఉపరితల రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీ అధికారికంగా ప్రకటించారు. కేంద్రం తీసుకున్న ఈ నిర్ణయంపై ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ హర్షం వ్యక్తం చేస్తూ సామాజిక మాధ్యమం 'ఎక్స్' వేదికగా ప్రధానమంత్రి మోదీకి, కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీకి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సమగ్ర మౌలిక వసతుల కల్పనకు, పారిశ్రామిక పురోగతికి కేంద్ర ప్రభుత్వం నిరంతరం అందిస్తున్న సహకారం అభినందనీయమని పవన్ కల్యాణ్ పేర్కొన్నారు. విశాఖపట్నం-చెన్నై పారిశ్రామిక కారిడార్‌లో కొప్పర్తి అత్యంత కీలకమైన నోడ్‌గా ఉందన్న ఆయన... కొత్తగా నిర్మించే అనుసంధాన రహదారి అందుబాటులోకి వస్తే పారిశ్రామిక సరుకు రవాణా మరింత వేగవంతం, సులభతరం అవుతుందని వెల్లడించారు. ఈ ప్రాజెక్టు ఫలితంగా రాయలసీమ ప్రాంతంలో పెట్టుబడులకు అనుకూలమైన వాతావరణం ఏర్పడటంతో పాటు, భారీ స్థాయిలో స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు, వాణిజ్య కార్యకలాపాలు పెరిగి రాయలసీమ ముఖచిత్రం మారుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

వికసిత్ భారత్ లక్ష్యంలో తెలంగాణ కీలక పాత్ర

రాష్ట్రం కీలక పాత్ర పోషించాల్సిన అవసరం ఉందని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క అన్నారు. 2047 నాటికి తెలంగాణను 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దే దిశగా ప్రభుత్వం ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగుతోందని తెలిపారు. దేశ ఆర్థిక వ్యవస్థలో ప్రస్తుతం తెలంగాణ వాటా ఉన్న స్థాయి నుంచి 5 శాతం నుంచి 10 శాతానికి పెంచే లక్ష్యంతో ప్రభుత్వం పనిచేస్తోందని పేర్కొన్నారు. ఇందుకోసం కేవలం ప్రభుత్వ రుణాలపై ఆధారపడే విధానానికి పరిమితం కాకుండా ప్రైవేట్, సంస్థాగత పెట్టుబడులను పెద్ద ఎత్తున సమీకరించే దిశగా చర్యలు చేపడుతున్నామని వివరించారు. రాష్ట్రానికి పెట్టుబడులు, పరిశ్రమలు, మౌలిక వసతులు, ఉపాధి అవకాశాలను తీసుకురావడంతో పాటు యువతకు మెరుగైన అవకాశాలు కల్పించడమే లక్ష్యంగా అభివృద్ధి ప్రణాళికలను రూపొందిస్తున్నట్లు భట్టి విక్రమార్క తెలిపారు. తెలంగాణ యువతే రాష్ట్రానికి అతిపెద్ద బలమని, వారి నైపుణ్యాలు, ప్రతిభను వినియోగించుకునేలా ఆర్థికాభివృద్ధి, ఉపాధి రంగాలను మరింత విస్తరించాల్సిన అవసరం ఉందన్నారు.

కీలక బిల్లుపై అమెరికా అధ్యక్షుడి సంతకం..
భారత్, చైనాలపై సుంకాలకు ట్రంప్‌కు ఫుల్ పవర్..!

భద్రతామండలి ఆమోదంలేని ఏ చర్యనూ ఆమోదించబోమని ఆ దేశ విదేశాంగశాఖ అధికార ప్రతినిధి గువో జియాకున్ స్పష్టంచేశారు. ఈ చట్టంతో ట్రంప్‌నకు మరిన్ని అధికారాలు లభించిన ట్లయ్యింది.రష్యా నాయకత్వంపై ఆంక్షలు విధించే అవకాశం దక్కింది. ఇంధన రంగంపై ఆంక్షల విధించవచ్చు. ఇప్పటికే ఉన్న ఆంక్షలను తప్పించుకుంటూ చమురు సరఫరాచేసే నౌకల షాడో ఫ్లీట్‌పైనా ఆంక్షలు విధించడానికి అధ్యక్షుడికి అధికారం దక్కుతుంది. రష్యా చమురు, గ్యాస్‌పై ఆధారపడటాన్ని తగ్గించేలా ఒత్తిడి తెస్తూ భారత్, చైనా వంటి దేశాలపై సుంకాల మోత మోగించే అధికారం ఉంటుంది.

భూటాన్‌లో భూకంపం.. 4.9 తీవ్రతతో
కంపించిన భూమి.. అసోంలోనూ ప్రకంపనలు

భూకంపాల తీవ్రతను కొలిచే నేషనల్ సెంటర్ ఫర్ సెస్మాలజీ (ఎన్‌సీఎస్) ఈ వివరాల్ని వెల్లడించింది. దీని ప్రకారం.. భూటాన్ ఈశాన్య ప్రాంతంలో శనివారం సాయంత్రం 4.01 గంటలకు భూకంపం సంభవించింది. దీని తీవ్రత 4.9గా నమోదైంది. గ్యెల్ఫోలంగ్‌కు 3 కిలోమీటర్ల దూరంలో, 5 కిలోమీటర్ల లోతున ఈ భూకంప కేంద్రం ఉంది. ఈశాన్య భూటాన్‌లోని అనేక ప్రాంతాల్లో ఈ భూకంపం నమోదైంది. అలాగే, సరిహద్దులో ఉన్న అసోంలోనూ కొన్ని ప్రాంతాల్లో ప్రకంపనాలు వచ్చాయి. దీంతో అనేక ప్రాంతాల్లో భూమి కంపించింది. ఇటు భూటాన్‌లోనూ, అటు అసోంలోనూ నష్టానికి సంబంధించి ఎలాంటి వివరాలు నమోదు కాలేదు. ఈ భూకంపానికి సంబంధించిన పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది. ప్రస్తుతానికి తీవ్ర నష్టం నమోదు కాకపోయినప్పటికీ.. అధికారులు ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉన్నట్లు భూటాన్ ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. మరోవైపు మూడు రోజుల క్రితం నేపాల్‌లో కూడా మరోసారి భూకంపం నమోదైన సంగతి తెలిసిందే. నేపాల్‌లో తాజాగా 4.5 తీవ్రతతో భూకంపం నమోదు కాగా.. ఎలాంటి ప్రాణ, ఆస్తి నష్టం సంభవించలేదు.

ఇంటర్ బోర్డులో డిజిటలైజేషన్,
రిటైర్మెంట్ వయోపరిమితి పెంపు

ఈ రికార్డులను అత్యాధునిక 'బ్లాక్‌చైన్ టెక్నాలజీ'తో అనుసంధానించనున్నారు. విద్యా పునర్నిర్మాణంతో పాటు ఇంటర్మీడియట్ బోర్డు పరిధిలో పనిచేస్తున్న సిబ్బందికి తీపి కబురు అందిస్తూ వారి పదవీ విరమణ వయోపరిమితిని 60 సంవత్సరాల నుంచి 62 ఏళ్లకు పెంచుతూ తుది తీర్మానం చేశారు. దీనికితోడు పరీక్షల నిర్వహణ ప్రక్రియను వేగవంతం చేసే క్రమంలో ఇన్విజిలేటర్లు, మూల్యాంకనదారుల శ్రమను గుర్తించి వారు అందుకునే భత్యాలను ఏకంగా 25 శాతం వరకు పెంచే ప్రతిపాదనకు ఆమోదం తెలిపారు. పరీక్షల్లో విద్యార్థుల సౌకర్యార్థం థియరీ సబ్జెక్టులకు 32 పేజీల బుక్‌లెట్లను అందించనున్నారు. మూల్యాంకనంలో ఏమాత్రం అలసత్వం వహించినా లేదా తీవ్రమైన తప్పులకు పాల్పడినా సంబంధిత సిబ్బందిపై కఠిన చర్యలు తప్పవని విద్యాశాఖ స్పష్టమైన హెచ్చరికలు జారీ చేసింది.

దానం నాగేందర్‌పై కోర్టు తీర్పు...
కేసీఆర్‌కు చెంపపెట్టు అన్న మహేశ్ కుమార్ గౌడ్

కాంగ్రెస్ టికెట్‌పై గెలిచిన సబిత ఇంద్రారెడ్డిని బీఆర్ఎస్‌లో చేర్చుకుని మంత్రి పదవులు ఇచ్చింది కేసీఆర్ కాదా?" అని ప్రశ్నించారు. కేసీఆర్ చర్యల వల్లే రాష్ట్రంలో ఫిరాయింపుల సంస్కృతి పెరిగిపోయిందని ఆరోపించారు. అదే సమయంలో బీజేపీపైనా ఆయన విమర్శలు గుప్పించారు. ప్రభుత్వాలను కూల్చివేయడం, పార్టీలను చీల్చడం బీజేపీకి అలవాటని అన్నారు. దేశవ్యాప్తంగా ప్రజాస్వామ్య వ్యవస్థను బీజేపీ నాశనం చేస్తోందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. కేసీఆర్, బీజేపీ ఇద్దరూ ఒకే తరహా రాజకీయాలు చేస్తున్నారని విమర్శించారు.

కారులో 500 పైగా బంగారు నాణేలు
స్వాధీనం చేసుకున్న పోలీసులు

జమ్ముకశ్మీర్‌లో వాహన తనిఖీల్లో 500కు పైగా బంగారు నాణేలు స్వాధీనం
ఇద్దరు పురుషులు, ఓ మహిళను అదుపులోకి తీసుకున్న భద్రతా బలగాలు

ఢిల్లీ : జమ్ముకశ్మీర్ లో భద్రతా బలగాల తనిఖీల్లో భారీగా బంగారు నాణేలు పట్టుబడ్డాయి. అనంత్ నాగ్ జిల్లాలోని మీర్ బజార్ ప్రాంతంలో ఓ కారులో తరలిస్తున్న 500కు పైగా బంగారు నాణేలను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటనకు సంబంధించి ఇద్దరు పురుషులు, ఓ మహిళను అరెస్ట్ చేశారు. నాణేలు ఎక్కడి నుంచి వచ్చాయి? వాటిని ఎక్కడికి తీసుకెళ్తున్నారు? అనే అంశాలపై అధికారులు దర్యాప్తు చేస్తున్నారు. మీర్ బజార్ సమీపంలో శుక్రవారం వాహన తనిఖీలు చేపట్టారు. ఈ క్రమంలో వీ09జూ0541 నంబర్ కలిగిన మారుతి సుజుకి జాజ్ ఎశ కారును భద్రతా సిబ్బంది ఆపారు. ఆ సమయంలో కారులో ముగ్గురు ప్రయాణిస్తున్నారు. కాజీగుండ్ నుంచి శ్రీనగర్ వైపు వెళ్తుండగా వాహనాన్ని నిలిపివేసినట్లు అధికారులు తెలిపారు. తనిఖీలు నిర్వహించగా కారులో పెద్ద సంఖ్యలో బంగారు నాణేలు బయటపడినట్లు వెల్లడించారు. దీంతో వాహనాన్ని స్వాధీనం చేసుకుని సమీపంలోని పోలీస్ పోస్టుకు తరలించారు.

500 నుంచి 600 నాణేలు

ప్రాథమిక దర్యాప్తులో భాగంగా 500 నుంచి 600 వరకు బంగారు నాణేలు ఉన్నట్లు గుర్తించినట్లు అధికారులు తెలిపారు. అయితే నాణేల అసలు సంఖ్య, మొత్తం బరువు, వాటి స్వచ్ఛత, మార్కెట్ విలువను ఇంకా నిర్ధారించాల్సి ఉందన్నారు. నాణేలు నిజంగా బంగారంతో తయారైనవేనా? వాటి వెనుక ఎలాంటి లావాదేవీలు ఉన్నాయి? అనే అంశాలను కూడా అధికారులు పరిశీలిస్తున్నారు.

వరంగల్ కొత్త ఎయిర్‌పోర్టుకు పేరు సూచించండి

మొదటి పేజి తరువాయి

కొత్త ఎయిర్‌పోర్టుకు ఏం పేరు పెట్టాలో సూచించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కోరారు. వరంగల్‌లో ప్రపంచ స్థాయి విమానాశ్రయం కల సాకారం కాబోతోందని ముఖ్యమంత్రి సంతోషం వ్యక్తం చేశారు. మామునూరు విమానాశ్రయం ఏర్పాటు కోసం చురుగ్గా జరుగుతున్న ప్రక్రియలపై పత్రికల్లో వచ్చిన కథనాలను ఎక్స్‌లో సీఎం పోస్ట్ చేశారు. బీఆర్ఎస్ పదేళ్ల అధికారంలో ఉన్నప్పటికీ వరంగల్ విమానాశ్రయం కలను నిజం చేయలేకపోయిందన్న రేవంత్ రెడ్డి ఆ పార్టీ నాయకులు కేవలం తమ కుటుంబ ప్రయోజనాలు, విలాసవంతమైన ఫామ్‌హౌస్‌లపైనే దృష్టి పెట్టారని వ్యాఖ్యానించారు. ఎట్టకేలకు కాంగ్రెస్ ప్రజాపాలనలో ఇప్పుడు వరంగల్ ఎయిర్‌పోర్ట్ కల సాకారం అవుతోందని స్పష్టం చేశారు. మామునూరు విమానాశ్రయం భూసేకరణ కోసం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం రూ.295 కోట్ల



కేటాయించడంతో పాటు అవసరమైన భూమిని సేకరించి ఎయిర్‌పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియాకు అప్పగించడంతో క్షేత్రస్థాయిలో కల రూపుదిద్దుకుంటోందని పేర్కొన్నారు. ఇది కేవలం విమానాశ్రయం మాత్రమే కాదని, పరిశ్రమలు, పర్యాటకం, విద్య, ఉద్యోగాలు పెట్టుబడులకు కొత్త గేట్‌వే అని రేవంత్ రెడ్డి అభివర్ణించారు. అభివృద్ధి చెందుతున్న, అనుసంధానించబడిన తెలంగాణ రాష్ట్రానికి కొత్త చిహ్నంగా నిలవనున్న వరంగల్ మామునూరు విమానాశ్రయం నుంచి ప్రయాణించేందుకు ఆసక్తిగా ఎదురుచూస్తున్నట్లు ముఖ్యమంత్రి వెల్లడించారు.

పర్యావరణ అనుమతులే ఆలస్యం

రేవంత్ రెడ్డి ఇటీవల ఢిల్లీ వెళ్లిన సందర్భంలో కేంద్రమంత్రి రామ్మోహన్‌నాయుడితో భేటీ అయ్యారు. మామునూరు విమానాశ్రయం ఏర్పాటులో మిగిలిన పనులు వేగంగా పూర్తి చేయాలని కోరారు. దీంతో సానుకూలంగా స్పందించిన రామ్మోహన్‌నాయుడు, ఎయిర్‌పోర్ట్ అథారిటీ అధికారులతో సమీక్ష చేశారు. పర్యావరణ అనుమతుల అంశం కూడా చర్చకు వచ్చింది. ఇప్పటికే ఏఏఐ అధికారులు సంబంధిత పత్రాలతో దరఖాస్తు సమర్పించిన నేపథ్యంలో త్వరగా ఆ ప్రక్రియ పూర్తి చేయాలని చెప్పారు.

నా జీవితం ధన్యమైంది - మీరు ఉండే ఇళ్లపై ఇక సర్వహక్కులు మీవే

మొదటి పేజి తరువాయి

వేల మంది ప్రజలకు ఇంటిపై శాశ్వత హక్కు కల్పిస్తున్న ఈరోజు తన జీవితంలో మర్చిపోనని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ, "నా జీవితం ధన్యమైంది, లబ్ధిదారుల ముఖాల్లో ఆనందం చూస్తున్నా. 11 మండలాలకు చెందిన 28,445 కుటుంబాలకు ఇళ్ల పట్టాలు ఇస్తున్నాం. మీరు ఉండే ఇళ్లపై సర్వహక్కులు ఇకనుంచి మీవే. పేదలకు పట్టాభిషేకం కార్యక్రమం ద్వారా ఇళ్లపై హక్కులు కల్పిస్తున్నాం. పేదలకు సొంతిళ్లు ఉండాలన్న ఎన్టీఆర్ స్ఫూర్తితోనే పని చేస్తున్నాం. సొంతిల్లు ఉండాలనేది, ప్రతి మనిషి కల. దశాబ్దాల కష్టాలు, అనిశ్చితికి నేటితో ముగింపు పలుకుతున్నాం. మీ ఇళ్లపై ఇకనుంచి వివాదం లేదు, ఎలాంటి భయం లేదు. మీ ఇళ్లపై ఇకనుంచి బ్యాంకు రుణాలు కూడా తీసుకోవచ్చు. రాజముద్ర వేసి మీకు ఇళ్ల పట్టాలు ఇస్తున్నాం. అభ్యంతరం లేని భూముల్లో పట్టాలు ఇస్తున్నాం. పేదలు స్వేచ్ఛగా బతకాలనే ఇళ్ల పట్టాలు ఇస్తున్నాం. ఇంకా 35 కాలనీల్లోని 10 వేల మంది పట్టాలు కోరుతున్నారు. దేవస్థానానికి చెందిన పంచగ్రామాల్లో 12,149 మందికి పట్టాలు ఇవ్వాలి. మిగతావారికి త్వరగా పట్టాలివ్వాలని అధికారులను ఆదేశిస్తున్నా. మీకు శాశ్వత చిరునామా కల్పించే బాధ్యత మా ప్రభుత్వానిది" అని సీఎం చంద్రబాబు తెలిపారు. "దేశంలో అత్యంత వేగంగా అభివృద్ధి చెందే నగరం విశాఖ. విశాఖ త్వరలో విశ్వనగరంగా మారుతుంది. మీరంతా గర్వంగా చెప్పుకునేలా విశాఖను మారుస్తున్నాం. అల్లూరి విమానాశ్రయం రాకతో ఉత్తరాంధ్ర కలలకు రెక్కలు వచ్చాయి. టూరిజం, లాజిస్టిక్స్ హబ్‌గా విశాఖ మారనుంది. పోలవరం ఎడమ కాలువ త్వరలో విశాఖకు వస్తుంది. చంద్రబాబు విశాఖకు హైవేలు, పోర్టులు, విమానాశ్రయాలు వచ్చాయి.



ఈ రెండేళ్లలో విశాఖకు 91 ప్రాజెక్టులు వచ్చాయి. ఈ విశ్వనగరంలో ప్రతి పేదవాడికీ భాగస్వామ్యం ఉండాలి."

స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాలతో యువతకు కొత్త అవకాశాలు'- రోజ్‌గార్ మేళాలో ప్రధాని మోదీ

మొదటి పేజి తరువాయి

భారత వ్యాపారులు చేరుకోవడంతో పాటు, యువతకు ఉద్యోగాలు, నైపుణ్యాల ఆధారంగా కొత్త అవకాశాలు ఏర్పడుతున్నాయని పేర్కొన్నారు. శనివారం నిర్వహించిన 20వ రోజ్‌గార్ మేళాలో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా యువతను ఉద్దేశించి ప్రధాని ఈ మేరకు మాట్లాడారు. ఈ సందర్భంగా 51వేల మందికి నియామకపత్రాలు అందజేశారు. భారత్ ఇప్పటివరకు వివిధ దేశాలతో 40 స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాలు చేసుకుందని ప్రధాని మోదీ తెలిపారు. వీటి ద్వారా భారత వ్యాపారులకు కొత్త భాగస్వామ్యాలు, కొత్త మార్కెట్లు అందుబాటులోకి వస్తున్నాయని చెప్పారు. అదే సమయంలో యువతకు కెరీర్‌లో కొత్త మార్గాలు తెరుచుకుంటున్నాయని పేర్కొన్నారు. భారత యువత నైపుణ్యాలు, ప్రతిభపై ప్రపంచ దేశాల్లో విశ్వాసం పెరుగుతోందని మోదీ అన్నారు. ఆవిష్కర్తలు, పారిశ్రామికవేత్తలు, యువత నుంచి ప్రపంచానికి భారీ అంచనాలు ఉన్నాయని చెప్పారు. ప్రభుత్వ సేవల్లో చేరుతున్న యువత ప్రతి నిర్ణయంలోనూ దేశాన్ని అభివృద్ధి, స్వావలంబన దిశగా తీసుకెళ్లే ఆలోచనను ముందుకు తీసుకెళ్లాలని సూచించారు. యువతకు ఇతర యువత పట్ల ప్రత్యేక బాధ్యత ఉందని చెప్పారు.

బ్రిక్స్‌లోనూ యువత భాగస్వామ్యం



ఇటీవల ముగిసిన బ్రిక్స్ సదస్సును ప్రధాని మోదీ ప్రస్తావించారు. బ్రిక్స్ సహకారం కేవలం ప్రభుత్వాలకే పరిమితం కాకూడదని అన్నారు. భారత పారిశ్రామికవేత్తలు, రైతులు, మహిళలు, యువత కూడా ఈ భాగస్వామ్యంలో చురుకైన భాగస్వాములు కావాలని పేర్కొన్నారు. అంతర్జాతీయ వేదికలపై భారత్ పాత్ర పెరుగుతున్న నేపథ్యంలో దేశ యువత తమ నైపుణ్యాలను మరింతగా అభివృద్ధి చేసుకోవాల్సిన అవసరం ఉందని ఆయన సూచించారు.

'నాగరిక్ దేవో భవ' స్ఫూర్తితో సేవ

ప్రతి రంగంలోనూ శరవేగంగా మార్పులు జరుగుతున్నాయని ప్రధాని మోదీ అన్నారు. 'నిరంతరం నేర్చుకుంటూనే మీరు ఈ స్థాయికి చేరుకున్నారు. ఇక్కడి నుంచి మళ్లీ కొత్త విషయాలు నేర్చుకునే సరికొత్త ప్రయాణం ప్రారంభమవుతుంది. మీరు ఎల్లప్పుడూ మీ నైపుణ్యాలను మెరుగుపరచుకోవాలి. కొత్త సాంకేతికతను, కొత్త వ్యవస్థలను అర్థం చేసుకోవాలి. 'మిషన్ కర్మయోగి'ఈ లక్ష్యాన్ని చేరుకోవటంలో మీకు సాయపడుతుంది. ప్రభుత్వం అసలైన బలం పౌరులకు దానిపై ఉన్న నమ్మకమే. ఆ నమ్మకం ఎలా వస్తుందంటే.. పౌరులకు ప్రభుత్వంతో ఎలాంటి అనుభవం ఎదురైందనే దాన్ని వల్ల వస్తుంది. ప్రభుత్వ సేవలో మన తారకమంత్రం ఒక్కటే కావాలి. 'నాగరిక్ దేవో భవ'. పౌరులకు సేవ చేయడమంటే దేశానికి సేవ చేయడమే. మీ పనితీరు వల్ల ఏ పౌరుడి జీవితమైనా సులభతరమైతే, అప్పుడే మీ విజయం మరింత ఉన్నతస్థాయికి చేరుకుంటుంది' అని ప్రధాన మోదీ పేర్కొన్నారు.

51 వేల మందికి పైగా నియామక పత్రాలు

20వ రోజ్‌గార్ మేళాలో భాగంగా 51 వేల మందికి పైగా కొత్తగా నియమితులైన యువతకు నియామక పత్రాలు అందించారు. దేశవ్యాప్తంగా 45 ప్రాంతాల్లో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. కొత్తగా ఎంపికైన అభ్యర్థులు రెవెన్యూ విభాగం, రైల్వేలు, హోం వ్యవహారాలు, ఆరోగ్యం-కుటుంబ సంక్షేమం, ఆర్థిక సేవలు, రక్షణ తదితర కేంద్ర ప్రభుత్వ శాఖలు, సంస్థల్లో విధుల్లో చేరనున్నారు. ఈ 20వ రోజ్‌గార్ మేళాతో కలిపి ఇప్పటివరకు వివిధ కేంద్ర ప్రభుత్వ శాఖలు, సంస్థల్లో సుమారు 12.75 లక్షల మంది యువతకు నియామక పత్రాలు అందినట్లు ప్రధాని కార్యాలయం వెల్లడించింది.

ఇది ప్రకృతి తెచ్చిన కరవు కాదు, ముమ్మాటికీ కాంగ్రెస్ మార్క్ కరవు

మొదటి పేజి తరువాయి

హైదరాబాద్ : మాజీ మంత్రి, బీఆర్ఎస్ సీనియర్ నేత హరీశ్‌రావు రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో విమర్శనాస్త్రాలు సంధించారు. రాష్ట్రంలో ప్రస్తుతం నెలకొన్న పరిస్థితులు ప్రకృతి వైపరీత్యం వల్ల వచ్చినవి కావని, ఇది ముమ్మాటికీ ప్రభుత్వ అసమర్థత వల్ల ఏర్పడిన కాంగ్రెస్ మార్క్ కరవు అని ఆయన ఆరోపించారు. కృష్ణా జలాలు వినియోగంలో ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని ఆయన ధ్వజమెత్తారు. శనివారం హైదరాబాద్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో హరీశ్‌రావు మాట్లాడుతూ, ఈ ఏడాది శ్రీశైలం నుంచి 84 టీఎంసీల నీటిని వినియోగించుకున్నామని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అసెంబ్లీలో పేర్కొనడం పచ్చి అబద్ధమని కొట్టిపారేశారు. వాస్తవానికి కల్వకుర్తి ఎత్తిపోతల పథకం ద్వారా ఇప్పటివరకు కేవలం 8 టీఎంసీల నీటిని మాత్రమే మళ్లించారని ఆయన స్పష్టం చేశారు. కల్వకుర్తి పథకంలోని ఐదు మోటార్లలో కేవలం రెండే పని చేస్తుండటం ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిదర్శనమని విమర్శించారు. గత మూడేళ్లలో కృష్ణా నదీ యాజమాన్య బోర్డు (కేఆర్ఎంబీ) గణాంకాల ప్రకారం ఆంధ్రప్రదేశ్ 718 టీఎంసీల నీటిని వినియోగించుకోగా, తెలంగాణ కేవలం 216 టీఎంసీలకే పరిమితమైందని ఆయన వివరించారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత 2024-25 ఆర్థిక సంవత్సరంలోనే అత్యంత తక్కువ స్థాయిలో కృష్ణా జలాలను వినియోగించుకోవడం అత్యంత విచారకరమని ఆవేదన వ్యక్తం చేశారు. "నీళ్లు అందుబాటులో ఉన్నాయి, ఎత్తిపోసేందుకు మోటార్లు సిద్ధంగా ఉన్నాయి. అయినప్పటికీ నీటిని మళ్లించలేని దుస్థితిలో ప్రభుత్వం ఉంది. అందుకే ఇది కాలం తెచ్చిన కరవు కాదు, కాంగ్రెస్ తెచ్చిన కరవు" అని ఆయన ఎద్దేవా చేశారు.

ఏపీ ప్రభుత్వం పోతిరెడ్డిపాడు, వెలిగొండ ప్రాజెక్టుల ద్వారా అక్రమంగా నీటిని తరలించుకుపోతున్నా, తెలంగాణ ప్రభుత్వం మౌనంగా ఉండటం దారుణమని దుయ్యబట్టారు.

నైరుతి రుతుపవనాల తిరోగమనం షురూ- ఈసారి దేశవ్యాప్తంగా 15 శాతం లోటు వర్షపాతం!

దేశాన్ని వీడుతున్న నైరుతి రుతుపవనాలు
సెప్టెంబర్ 19న పశ్చిమ రాజస్థాన్‌లోని కొన్ని ప్రాంతాల నుంచి తిరోగమనం ప్రారంభం
ఈసారి దేశవ్యాప్తంగా 15 శాతం లోటు వర్షపాతం నమోదైందని ఐఎండీ ప్రకటన

ఢిల్లీ : భారతదేశంలో ఈ ఏడాది నైరుతి రుతుపవనాల కాలం ముగింపు దశకు చేరుకుంది. దేశంలో రుతుపవనాల తిరోగమనం ప్రారంభమైంది. 2026, సెప్టెంబర్ 19న పశ్చిమ రాజస్థాన్‌లోని పలు ప్రాంతాల నుంచి నైరుతి రుతుపవనాలు వెనక్కి వెళ్లినట్లు భారత వాతావరణ శాఖ (×వీణ) తెలిపింది. సాధారణంగా సెప్టెంబర్ 17 నాటికే రాజస్థాన్ నుంచి ఈ నైరుతి రుతుపవనాల ఉపసంహరణ ప్రక్రియ ప్రారంభం కావాల్సి ఉండగా, ఈ ఏడాది 2 రోజులు ఆలస్యంగా తిరోగమనం ప్రారంభమైంది. ఐఎండీ ప్రకారం రాబోయే 3 నుంచి 4 రోజుల్లో రాజస్థాన్‌లోని ఇతర ప్రాంతాలతో పాటుగా పంజాబ్, కచ్, సౌరాష్ట్రలోని కొన్ని ప్రాంతాల నుంచి కూడా ఈ రుతుపవనాలు వెనక్కి వెళ్లడానికి వాతావరణ పరిస్థితులు అనుకూలంగా ఉన్నాయి.

జూన్ 4న కేరళలోకి ఎంట్రీ- జులై 9న దేశమంతటా విస్తరణ

ఇక ఈ ఏడాది జూన్ 4న కేరళలోకి తొలుత నైరుతి రుతుపవనాలు ప్రవేశించాయి. తర్వాత క్రమక్రమంగా దేశంలోని ఇతర ప్రాంతాలకు కూడా విస్తరించాయి. జులై 9 నాటికి దేశం మొత్తం రుతుపవనాలు వ్యాపించాయి. ఇప్పుడు సెప్టెంబర్ మూడో వారంలో పశ్చిమ రాజస్థాన్ నుంచి నైరుతి రుతుపవనాల తిరోగమనం ప్రారంభమైంది. అయితే ఈ సారి నైరుతి రుతుపవనాల సీజన్‌లో దేశవ్యాప్తంగా వర్షపాతం ఆశించిన స్థాయిలో లేదు. ఐఎండీ డేటా ప్రకారం జూన్ 4 నుంచి సెప్టెంబర్ 19 వరకు దేశవ్యాప్తంగా చూస్తే వర్షపాతం లోటు 15 శాతంగా ఉంది. వర్షపాతం లోటు అధికంగా ఉన్న ప్రాంతాల్లో దక్షిణ ద్వీపకల్పం ఉంది. దేశంలోనే అత్యధికంగా ఇక్కడ ఏకంగా 29 శాతం లోటు వర్షపాతం నమోదైంది.

ఒక్క జులైలోనే అధిక వర్షపాతం నమోదు

ఈ రుతుపవనాల సీజన్‌లో ఇప్పటివరకు జులై నెలలో మాత్రమే అధిక వర్షపాతం నమోదైంది. అంటే ఈ ఒక్క నెలలోనే సాధారణ వర్షపాతం కంటే అధికంగా వర్షపాతం (సర్‌ప్లస్) నమోదైందన్నమాట. జులై నెలలో సగటు సాధారణ వర్షపాతం 280.5 మిల్లీమీటర్లు కాగా, ఈ ఏడాది జులైలో ఏకంగా 283.3 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. అంతకుముందు జూన్ నెలలో పరిస్థితి భిన్నంగా ఉంది. వాస్తవానికి రుతుపవనాలే పలు ప్రాంతాల్లో కాస్త ఆలస్యంగా వచ్చాయంటే, వర్షాలు కూడా అంతంత మాత్రంగానే కురిశాయి. సాధారణంగా జూన్‌లో 165 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు కావాల్సి ఉండగా, కేవలం 106.8 మిల్లీమీటర్లు మాత్రమే కురిసింది. దీంతో జూన్ నెలలో దేశవ్యాప్తంగా చూస్తే 35 శాతం లోటు వర్షపాతం (డెఫిసిట్) నమోదైంది. గత నెల ఆగస్టులో కూడా పరిస్థితులు ఏమంత మెరుగ్గా లేవు. ఆగస్ట్ 31న ఐఎండీ నెలవారీగా విడుదల చేసే డేటా ప్రకారం చూస్తే ఆగస్టులో దేశవ్యాప్తంగా 213.3 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. 2001 తర్వాత ఆగస్ట్ నెలలో నమోదైన ఏడో అత్యల్ప వర్షపాతం ఇదే కావడం గమనార్హం.

ఎల్‌నినో ఎఫెక్ట్‌తోనే లోటు వర్షపాతం

ఈ 2026 ఏడాది నైరుతి రుతుపవనాల సీజన్‌లో వర్షపాతం తగ్గడానికి ప్రధాన కారణాల్లో పసిఫిక్ మహాసముద్రంలో ఎల్‌నినో పరిస్థితులు ఏర్పడటం. సదర్న్ ఆసిలేషన్ అనే వాతావరణ వ్యవస్థలోని 3 దశల్లో ఈ ఎల్‌నినో ఒకటి. ఇక్కడ పసిఫిక్ మహాసముద్రంలో సముద్ర ఉపరితల ఉష్ణోగ్రతల్లో మార్పులతో పాటు ఇంకా వాతావరణ మార్పులు కూడా సంభవించే పరిస్థితి ఏర్పడుతుంది. దీని వల్ల వర్షపాతాలు తగ్గడమే కాకుండా వాతావరణంలో వేడి విపరీతంగా పెరుగుతుంది. సకాలంలో వర్షాలు కురవవు. అదే విధంగా అకాలంగా ఉరుములు, మెరుపులు సహా వడగండ్ల వానలకు దారితీస్తుంది. కొన్ని చోట్ల కురవాల్సిన దాని కంటే తక్కువగా, కొన్ని చోట్ల అకాలంగా కురుస్తుంటాయి. రుతుపవనాలు ముగిసే సమయంలో అకస్మాత్తుగా భారీ వర్షాలు కూడా పడే ప్రమాదం ఉందని గతంలోనే ఐఎండీ హెచ్చరించింది. ఇక ఎల్‌నినోకు వ్యతిరేకంగా ఉండే దశను లా నినా (ఘ చీఱఱఖ) అని పిలుస్తారు. ఈ సమయంలో ఉష్ణోగ్రతలు తగ్గడంతో పాటు కొన్ని ప్రాంతాల్లో అధిక వర్షాలు కురిసే అవకాశం ఉంటుంది. మధ్యలో న్యూట్రల్ ఫేజ్ కూడా ఉంటుంది.

రూ.20 కోట్లతో మంచిర్యాల బస్టాండ్‌కు మహర్దశ

ప్రయాణికుల సౌకర్యాలే లక్ష్యంగా ఆధునీకరణ పనులకు కార్యాచరణ

మంచిర్యాల, సెప్టెంబర్ 19: మంచిర్యాల పట్టణంలోని బస్టాండ్‌ను సుమారు రూ.20 కోట్ల వ్యయంతో ఆధునీకరించేందుకు చర్యలు చేపడుతున్నట్లు ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు తెలిపారు.ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు కల్పించడంతో పాటు, బస్టాండ్‌ను ఆధునిక వసతులతో అభివృద్ధి చేయనున్నట్లు పేర్కొన్నారు.ఈ మేరకు శనివారం ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్ రావు సంబంధిత అధికారులతో కలిసి మంచిర్యాల బస్టాండ్‌ను పరిశీలించారు.బస్టాండ్‌లో ప్రస్తుతం ఉన్న మౌలిక వసతులు,ప్రయాణికులు ఎదుర్కొంటున్న ఇబ్బందులు,చేపట్టాల్సిన పునరుద్ధరణ పనులపై అధికారులతో చర్చించారు.ప్రయాణికులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అవసరమైన వసతులను ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు.ఆధునీకరణలో భాగంగా బస్టాండ్‌లో ప్రయాణికులకు అవసరమైన మౌలిక సదుపాయాలను మెరుగుపరచడంతో పాటు, భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి పనులను ప్రణాళికాబద్ధంగా చేపట్టాలని ఎమ్మెల్యే సూచించారు. ప్రజలకు మెరుగైన రవాణా సేవలు అందేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు.ఈ పరిశీలన కార్యక్రమంలో ఆర్టీసీ ఈడీ రాజశేఖర్,మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ అన్వేష్, మేయర్ ధర్ని మధుకర్,డిప్యూటీ మేయర్ సల్ల రమ్యమహేష్, కార్పొరేషన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు,కార్పొరేటర్ తూముల నరేష్, మంచిర్యాల మార్కెట్ కమిటీ చైర్మన్ రామగిరి బానేష్‌తో పాటు మున్సిపల్ అధికారులు,కార్పొరేటర్లు, నాయకులు, మహిళా నాయకురాళ్లు,యువజన కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

వినాయక మండపాల్లో ప్లాస్టిక్‌కు నో.. ప్రకృతి పదార్థాలకే జై

సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నివారణపై 'ప్రకృతిమిత్ర' అవగాహన

నస్పూర్, సెప్టెంబర్ 19: వినాయక నవరాత్రుల సందర్భంగా పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యం ఇవ్వాలని 'ప్రకృతిమిత్ర' తెలంగాణ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.ఇందులో భాగంగా శనివారం నస్పూర్ కలెక్టరేట్ రోడ్డులోని శ్రీ సిద్ధి వినాయక గణేష్ మండపం వద్ద సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నివారణపై భక్తులకు అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా ఆకు దొప్పలు, అరికే ఆకు పళ్లాలు, జనపనార సంచులు,బట్ట సంచులు,కాగితపు సంచులు,స్టీల్ పళ్లాలు, గ్లాసులు తదితర పర్యావరణహిత వస్తువులను ప్రదర్శించి వాటి వినియోగంపై వివరించారు. 'ప్లాస్టిక్ వద్దు.. ప్రకృతి పదార్థాలే ముద్దు', 'థర్మాకోల్ పళ్లాలు వద్దు.. ఆకు దొప్పలే ముద్దు' అంటూ నినాదాలు చేశారు.ఈ సందర్భంగా ప్రకృతిమిత్ర తెలంగాణ వ్యవస్థాపకులు,ప్రభుత్వ వాల్టా అథారిటీ పర్యావరణవేత్త గుండేటి యోగేశ్వర్ మాట్లాడుతూ వినాయక మండపాల్లో సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వినియోగాన్ని పూర్తిగా నివారించాలని కోరారు.భక్తులకు ప్రసాద వితరణలో ప్లాస్టిక్ కవర్లు, పళ్లాలకు బదులుగా ప్రకృతిసిద్ధమైన వస్తువులను ఉపయోగించాలని సూచించారు.ఆకు దొప్పలు, వెదురు బుట్టలు,మట్టి పాత్రలు వంటి పర్యావరణహిత వస్తువులు వినియోగించడం ద్వారా కాలుష్యాన్ని తగ్గించవచ్చన్నారు.వినాయక మండపాల నిర్వాహకులు స్టీల్ బ్యాంకులు ఏర్పాటు చేసుకొని పునర్వినియోగ వస్తువులను ప్రోత్సహించాలని సూచించారు.పండుగల నిర్వహణలో భక్తి భావంతో పాటు ప్రకృతి పరిరక్షణకు కూడా ప్రాధాన్యం ఇవ్వాల్సిన అవసరం ఉందన్నారు.భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 51ఏ(జి) స్ఫూర్తితో ప్రతి పౌరుడు పర్యావరణ పరిరక్షణలో భాగస్వామి కావాలని పిలుపునిచ్చారు.వినాయక నిమజ్జనం సందర్భంగా రసాయన రంగులకు బదులుగా సహజమైన పసుపు, కుంకుమ,పూలను వినియోగించాలని కోరారు.నదులు, చెరువులు,జలాశయాల్లో రసాయనాలతో కూడిన పదార్థాలను కలపకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.టీఎన్జీవోస్ జిల్లా అధ్యక్షుడు,హౌసింగ్ సొసైటీ కాలనీ సిద్ధి వినాయక గణేష్ మండలి అధ్యక్షుడు గడియారం శ్రీహరి మాట్లాడుతూ గత సంవత్సరం నుంచి తమ మండపంలో వినాయక నవరాత్రుల సందర్భంగా ప్లాస్టిక్ వినియోగాన్ని నివారించేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.పర్యావరణ పరిరక్షణలో మహిళలు భాగస్వామ్యం కావడం అభినందనీయమన్నారు. ప్రకృతిమిత్ర ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అవగాహన కార్యక్రమాలు ప్రజల్లో మార్పుకు దోహదపడుతున్నాయని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ప్రకృతిమిత్ర సభ్యులు,వినాయక మండలి ప్రతినిధులు కస్తూరి నాగేశ్వర్,పొన్న మల్లయ్య,శ్రీపతి బాబురావు,టి. సంపత్‌కుమార్,కె. రాజమౌళి,వెంకటేశం, నాన్నయ్య,స్వర్ణలత, సునీత,నీరజ,కమల, పద్మాంజలితో పాటు కాలనీవాసులు,మహిళలు పాల్గొన్నారు.

ఆశ్రమ పాఠశాలల్లో సౌకర్యాలు పరిశీలించిన డిప్యూటీ డైరెక్టర్

విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేసిన జాదవ్ అంబాజీ

కోమరం భీమ్,సెప్టెంబర్ 19.. కోమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా జైనూర్ మండలంలోని పానాపటార్, మార్లావాయి, కోహినూర్ ఆశ్రమ పాఠశాలలను గిరిజన సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ జాదవ్ అంబాజీ శనివారం సందర్శించారు. విద్యార్థుల వసతి గదులు,భోజన ఏర్పాట్లు, పరిసరాల పరిశుభ్రతను పరిశీలించి, పాఠశాల ఆశ్రమ పాఠశాల ఆవరణలో పెరిగిన పిచ్చిమొక్కలను తొలగించారు. అనంతరం విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు. విద్యార్థులతో వారి చదువు, ఆరోగ్యం, తాగునీరు, విద్యుత్, మరుగుదొడ్ల సౌకర్యాలపై వివరాలు తెలుసుకున్నారు. విద్యార్థులు తమ సమస్యలను డిప్యూటీ డైరెక్టర్ దృష్టికి తీసుకురాగా, విద్యాభివృద్ధికి అవసరమైన సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. క్రమశిక్షణతో చదివి ఉన్నత లక్ష్యాలు సాధించాలని విద్యార్థులకు సూచించారు.

అనుమతి లేకుండా విధులకు గైర్హాజరైతే చర్యలు

వైద్య కళాశాలలో ఆకస్మిక తనిఖీ చేసిన కలెక్టర్ హరిత

కొమరం భీమ్, సెప్టెంబర్ 19.. కొమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా ప్రభుత్వ ఉద్యోగులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని, అనుమతి లేకుండా విధులకు గైర్హాజరైతే వారిపై చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ కె.హరిత స్పష్టం చేశారు. శనివారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ వైద్య కళాశాలలో ఆకస్మిక తనిఖీ నిర్వహించి సిబ్బంది హాజరు పట్టికను పరిశీలించారు. అనుమతి లేకుండా గైర్హాజరైన అసిస్టెంట్ ప్రొఫెసర్లపై చర్యలు తీసుకోవాలని డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ అధికారులకు ఫోన్‌లో ఆదేశించారు. సమయపాలన పాటించని, తరచూ గైర్హాజరయ్యే ఉద్యోగులను ఉపేక్షించేది లేదని కలెక్టర్ హెచ్చరించారు.

కలెక్టర్ చొరవతో వృద్ధుడికి కుటుంబ ఆసరా

తండ్రిని ఇంటికి తీసుకెళ్లిన కుమారుడు

ఆసిఫాబాద్ సెప్టెంబర్ 19: కొమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా కాగజ్‌నగర్ మండలం బోడేపల్లి గ్రామానికి చెందిన మల్లయ్య అనే వృద్ధుడు కుమారుడు తనను పట్టించుకోవడం లేదని ఆవేదనతో ఈ నెల 18న జిల్లా కలెక్టరేట్‌కు వచ్చారు. విషయం తెలుసుకున్న జిల్లా కలెక్టర్ కె.హరిత వెంటనే స్పందించి, వృద్ధుడి వద్దకు స్వయంగా వెళ్లి పరిస్థితిని తెలుసుకున్నారు. తక్షణ రక్షణ, వసతి కల్పించేలా అధికారులను ఆదేశించారు. విషయం తెలుసుకున్న కుమారుడు స్పందించి, తండ్రి బాధ్యతను పూర్తిగా స్వీకరిస్తానని హామీ ఇచ్చారు. కలెక్టర్ కుమారుడితో మాట్లాడి కుటుంబ బాధ్యతలను వివరించగా, తండ్రిని ప్రేమగా చూసుకుంటానని తెలిపి ఇంటికి తీసుకెళ్లారు. తన సమస్య పరిష్కారమైనందుకు వృద్ధుడు సంతోషం వ్యక్తం చేశారు. వృద్ధాప్యంలో కుటుంబ సభ్యుల ఆదరణ, భద్రత అవసరమని, వృద్ధుల పట్ల మానవతా దృక్పథంతో వ్యవహరించాలని కలెక్టర్ కె.హరిత సూచించారు.

ప్రజల సమస్యలపై ప్రశ్నించిన జిల్లా సర్పంచుల సంఘం వైస్ ప్రెసిడెంట్ దాసరి మణిదీపక్.

భీమారం , సెప్టెంబర్ 19. భీమారం మండల కేంద్రంలో ఈరోజు నిర్వహించిన మండల స్థాయి సమీక్ష సమావేశంలో మంచిర్యాల జిల్లా సర్పంచుల సంఘం వైస్ ప్రెసిడెంట్, ధర్మారం గ్రామ సర్పంచ్ మణిదీపక్ దాసరి పాల్గొని మండలంలోని 11 గ్రామ పంచాయతీల ప్రజలు ఎదుర్కొంటున్న పలు సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి ప్రశ్నించారు. ప్రజాపాలన అని చెప్పుకునే ప్రభుత్వం గ్రామాల అభివృద్ధి, ప్రజల సంక్షేమం కోసం కనీస మౌలిక వసతులు కల్పించాల్సిన బాధ్యత ఉందని ఆయన అన్నారు. అయితే గ్రామ పంచాయతీలకు సరైన నిధులు అందకపోవడంతో అనేక అభివృద్ధి పనులు నిలిచిపోతున్నాయని, దీనిపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు. ముఖ్యంగా ధర్మారం గ్రామ పంచాయతీ పరిధితో పాటు భీమారం మండలంలోని 11 గ్రామ పంచాయతీల పరిధిలో రైతులు విద్యుత్ సమస్యలతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. పంటలకు కీలకమైన సమయంలో తరచూ విద్యుత్ కోతలు విధించడం, త్రీ-ఫేజ్ విద్యుత్ సరఫరాలో అంతరాయాలు ఏర్పడటంతో అన్నదాతలు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. రైతులకు అవసరమైన సమయంలో నిరంతరాయంగా విద్యుత్ సరఫరా జరిగేలా అధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా అధికారులు ప్రోటోకాల్‌ను పాటిస్తూ, ప్రజాప్రతినిధులను గౌరవిస్తూ పారదర్శకంగా పనిచేయాలని సూచించారు. ప్రజా సమస్యల పరిష్కారంలో ఎలాంటి వివక్షకు తావులేకుండా అన్ని గ్రామ పంచాయతీలకు సమాన ప్రాధాన్యత ఇవ్వాలని అన్నారు. ప్రత్యేకంగా ఎస్సీ, ఎస్టీ ప్రజలు అధికంగా నివసించే గ్రామ పంచాయతీలతో పాటు దళిత సర్పంచులు ప్రాతినిధ్యం వహిస్తున్న గ్రామ పంచాయతీలపై ఎలాంటి వివక్ష లేకుండా అభివృద్ధి పనులు, నిధులు అందించాలని అధికారులను కోరారు. గ్రామాల అభివృద్ధి విషయంలో రాజకీయాలు, వ్యక్తిగత అభిప్రాయాలకు తావులేకుండా పారదర్శకంగా వ్యవహరించాలని ఆయన స్పష్టం చేశారు.

నేడే జిల్లా స్థాయి నెట్‌బాల్ ఎంపిక పోటీలు

మందమర్రి సెప్టెంబర్ 19 : స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ (ఎస్‌జీఎఫ్) ఆధ్వర్యంలో మంచిర్యాల జిల్లా స్థాయి నెట్‌బాల్ ఎంపిక పోటీలు శనివారం నిర్వహించనున్నారు. మందమర్రి పాత బస్టాండ్‌లోని హైదరాబాద్ కృష్ణవేణి పాఠశాలలో 17, 14 సంవత్సరాల లోపు బాలబాలికలకు ఈ ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్లు ఎస్‌జీఎఫ్ సెక్రటరీ యాకుబ్, ఆర్గనైజింగ్ సెక్రటరీ రాం వేణు తెలిపారు.ఎంపిక పోటీలకు హాజరయ్యే విద్యార్థులు ఉదయం 9 గంటలకు క్రీడా ప్రాంగణానికి చేరుకోవాలని సూచించారు. విద్యార్థులు తమ వెంట ఆధార్ కార్డు, జనన ధ్రువీకరణ పత్రం (బర్త్ సర్టిఫికెట్), పాఠశాల బోనాఫైడ్ సర్టిఫికెట్ తప్పనిసరిగా తీసుకురావాలని వారు తెలిపారు. అర్హత కలిగిన విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

మందమరి మోడల్ స్కూల్ లో విద్యార్థి నాయకులకు ప్రమాణ స్వీకారం

విద్యార్థి దశ నుంచే నాయకత్వ లక్షణాలను పెంపొందించుకోవాలి: సీఐ రమేష్

మందమర్రి, సెప్టెంబర్ 19: విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలను పెంపొందించడంతో పాటు ప్రజాస్వామ్య ఎన్నికల విధానంపై అవగాహన కల్పించేందుకు మందమర్రి పట్టణంలోని తెలంగాణ మోడల్ హైస్కూల్, ఇంటర్మీడియట్ విద్యాలయంలో విద్యార్థి నాయకుల ప్రమాణ స్వీకార కార్యక్రమాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. పాఠశాల ప్రిన్సిపల్ సారా తస్నీం ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి మందమర్రి సర్కిల్ ఇన్‌స్పెక్టర్ రమేష్ ముఖ్య అతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. 202627 విద్యా సంవత్సరానికి భారత ఎన్నికల విధానాన్ని అనుసరిస్తూ 8, 9, 10 తరగతులతో పాటు ఇంటర్మీడియట్ విద్యార్థులకు నిర్వహించిన ఎన్నికల్లో విజయం సాధించిన విద్యార్థులను వివిధ నాయకత్వ బాధ్యతలకు ఎంపిక చేశారు. అనంతరం సీఐ రమేష్ విజేతలకు బ్యాడ్జీలు అందించి, వారికి కేటాయించిన పదవులకు అనుగుణంగా ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా సీఐ రమేష్ మాట్లాడుతూ.. విద్యార్థుల సమస్యలను ఉపాధ్యాయుల దృష్టికి తీసుకెళ్లేందుకు తమ ప్రతినిధిని తామే ఎన్నుకునే విధంగా ఎన్నికల ప్రక్రియ నిర్వహించడం అభినందనీయమన్నారు. విద్యార్థి దశ నుంచే మంచి చెడులను గుర్తించి సన్మార్గంలో నడవాలని సూచించారు. సెల్‌ఫోన్‌లకు బానిసలుగా మారకుండా వాటిని అవసరమైన మేరకు మాత్రమే వినియోగించాలని సూచించారు. ఎన్నికల ద్వారా స్కూల్ కెప్టెన్‌గా జయశంకర్ (సీఈసీ ద్వితీయ సంవత్సరం), హెడ్ బాయ్‌గా ఆడెపు చరణ్ (ఎంపీసీ ప్రథమ సంవత్సరం), హెడ్ గర్ల్‌గా సాహితీ (సీఈసీ ప్రథమ సంవత్సరం), స్పోర్ట్స్ కెప్టెన్‌గా చరణ్ (9వ తరగతి), ప్రకృతి కెప్టెన్‌గా యుక్త హాసిని (ఏసీఈ ప్రథమ సంవత్సరం) ఎంపికయ్యారు. వీరికి సీఐ రమేష్ బ్యాడ్జీలు అందించి అధికారికంగా బాధ్యతలు అప్పగించారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన నృత్యాలు, సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వినాయక నిమజ్జనంలో విషాదం

చెరువులో గల్లంతైన వ్యక్తి మృతి

గాలింపు తర్వాత లభ్యమైన మృతదేహం

,జైనూర్, సెప్టెంబర్ 19... జైనూర్ మండలం జామ్ని పంచాయతీ పరిధిలోని సాంబాజిగూడ చెరువులో శుక్రవారం రాత్రి వినాయక నిమజ్జనం విషాదంగా మారింది. జామ్ని గ్రామ సమీపంలోని చెరువులో వినాయక నిమజ్జనం సందర్భంగా ప్రమాదవశాత్తు గల్లంతైన ముండే రజనీకాంత్ (35) మృతి చెందాడు. రజనీకాంత్ చెరువులో గల్లంతైన వెంటనే గ్రామస్తులు, పోలీసులు అతని కోసం గాలింపు చేపట్టారు. నీటిలో గాలించినప్పటికీ ఆచూకీ లభించకపోవడంతో శనివారం రిస్క్ టీమ్ సహాయంతో పోలీసులు గాలింపు చర్యలు ముమ్మరం చేశారు. తర్వాత రజనీకాంత్ మృతదేహం లభ్యమైంది. రజనీకాంత్ ప్రమాదవశాత్తు చెరువులో గల్లంతై మృతి చెందడంతో జామ్ని గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. కుటుంబ సభ్యులు, గ్రామస్తులు తీవ్ర విషాదంలో మునిగిపోయారు.

సెప్టెంబర్ 21న ఛలో భద్రాచలం ఐటీడీఏ ఆదివాసీ మార్చ్‌ను విజయవంతం చేయాలి

భద్రాచలం,సెప్టెంబర్ 19.. ఈ నెల 21 న భద్రాచలం ఐటీడీఏ కార్యాలయం ముందు నిర్వహించనున్న ఆదివాసీ మార్చ్‌ముట్టడి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని తుడుం దెబ్బ కమిటీ మరియు ఆదివాసీ విద్యార్థి సంఘం కమిటి ఆధ్వర్యంలో విస్తృత ప్రచారం నిర్వహించారు.

తుడుం దెబ్బ

ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, ఆదివాసుల హక్కులు, అస్తిత్వం, భవిష్యత్తు కోసం నిర్వహిస్తున్న సెప్టెంబర్ 21 భద్రాచలం ఐటీడీఏ ఆదివాసీ మార్చ్‌ముట్టడి కార్యక్రమానికి ప్రతి గ్రామం నుంచి ఆదివాసులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. గూడెం గూడెం నుంచి ఉట్నూర్‌కు తరలివచ్చి ఆదివాసీ మార్చ్‌ను విజయవంతం చేయాలని గ్రామ పటేళ్లు, యువతీ యువకులు, ప్రజలను కోరారు.

చీలపల్లి ప్రజల సమస్యలకు పరిష్కారం

వారం రోజుల్లో వాగులపై కల్వర్టుల పనులు ప్రారంభం

ఎమ్మెల్సీ దండే విఠల్

ఆసిఫాబాద్ సెప్టెంబర్ 19: కొమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా సిర్పూర్(టి) మండలం చీలపల్లి గ్రామ ప్రజలు వర్షాకాలంలో ఎదుర్కొంటున్న రాకపోకల సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లినట్లు ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఎమ్మెల్సీ దండే విఠల్ తెలిపారు. చీలపల్లి మార్గంలోని రెండు వాగులపై కల్వర్టుల నిర్మాణానికి కలెక్టర్ నిధులు మంజూరు చేశారని పేర్కొన్నారు. వంతెన నిర్మాణం చేపట్టాలని ప్రజలు కోరగా, అటవీ శాఖ అనుమతుల కారణంగా కొంత సమయం పట్టే అవకాశం ఉందని, అప్పటివరకు ఇబ్బందులు తగ్గించేందుకు వారం రోజుల్లో రెండు వాగులపై కల్వర్టుల పనులు ప్రారంభిస్తామని ఎమ్మెల్సీ హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో చీలపల్లి సర్పంచ్, ప్రజా ప్రతినిధులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

పోలీస్ స్టేషన్లను సందర్శించిన డీఐజీ అంబర్ కిషోర్ ఝా

నేరాల నియంత్రణ, మహిళల భద్రతపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఆదేశం

ఆసిఫాబాద్ సెప్టెంబర్ 19: కొమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా కాళేశ్వరం జోన్-1 డీఐజీ అంబర్ కిషోర్ ఝా శనివారం ఆసిఫాబాద్ పట్టణ పోలీస్ స్టేషన్, వాంకిడి సర్కిల్ ఇన్‌స్పెక్టర్ కార్యాలయాన్ని సందర్శించారు. వివిధ విభాగాలు, రికార్డులు, కేసుల దర్యాప్తు పురోగతిని పరిశీలించారు. జిల్లా ఎస్పీ నితికా పంత్ పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికారు. పోలీస్ అధికారులతో కలిసి సర్కిల్ కార్యాలయ ఆవరణలో మొక్కలు నాటారు. పోలీస్ స్టేషన్ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని, స్వాధీనం చేసుకున్న వాహనాలను క్రమబద్ధంగా భద్రపరచి వివరాలు నమోదు చేయాలని ఆదేశించారు. 5ఎస్ విధానం అమలుతో పాటు రికార్డులు, ఫైళ్లను క్రమబద్ధంగా నిర్వహించాలని సూచించారు. తీవ్రమైన నేరాల కేసులు, పెండింగ్ కేసుల ఫైళ్లను పరిశీలించి, దర్యాప్తు పురోగతి, నిందితుల అరెస్టులు, పెండింగ్‌కు గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. పోలీస్ సిబ్బంది కిట్‌ను పరిశీలించి వారి శాఖాపరమైన సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కేసుల దర్యాప్తులో నాణ్యత, వేగం ఉండాలని, ఆధారాలను పూర్తిగా సేకరించాలని సూచించారు. శాంతిభద్రతల పరిరక్షణలో అప్రమత్తంగా ఉండాలని, మహిళలు, బాలికల భద్రతకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని, ట్రాఫిక్ నియంత్రణపై ప్రత్యేక దృష్టి సారించాలని డీఐజీ అంబర్ కిషోర్ ఝా సూచించారు. ప్రజలతో సత్సంబంధాలు కొనసాగిస్తూ సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని పోలీస్ అధికారులకు సూచించారు.

సర్పంచ్‌లకు శిక్షణ శిబిరం నిర్వహించిన రాజీవ్ గాంధీ పంచాయతీరాజ్

గ్రామాభివృద్ధి, పాలనపై అవగాహన కల్పించిన అజ్మీరా శ్యామ్ నాయక్

ఆసిఫాబాద్ సెప్టెంబర్ 19: కొమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా రాజీవ్ గాంధీ పంచాయతీరాజ్ సంఘటన్ ఆధ్వర్యంలో సర్పంచ్‌లకు శిక్షణ శిబిరం నిర్వహించారు. ఆసిఫాబాద్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఇంచార్జి అజ్మీరా శ్యామ్ నాయక్ పాల్గొని, పంచాయతీరాజ్ వ్యవస్థ బలోపేతం, గ్రామాల అభివృద్ధి, స్థానిక పాలనపై చర్చించారు. మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని తిరిగి ప్రారంభించాలని సర్పంచ్‌లకు సూచించారు. గ్రామీణాభివృద్ధికి సర్పంచులు, స్థానిక ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలని కోరారు. కార్యక్రమానికి ఏఐసీసీ కార్యదర్శి, తెలంగాణ ఇంచార్జి సచిన్ సావంత్ హాజరయ్యారు. శిక్షణలో పొందిన అంశాలను గ్రామస్థాయిలో అమలు చేసి ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని అజ్మీరా శ్యామ్ నాయక్ కోరారు. సర్పంచుల పాత్ర, మెరుగైన పాలనపై ప్రత్యేక శిక్షణ, అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ దండే విఠల్, మాజీ ఎమ్మెల్యే ఆత్రం సక్కు, సర్పంచుల సంఘం జిల్లా అధ్యక్షుడు మోరే సంతోష్, ఆర్జీపీఆర్ఎస్ తెలంగాణ రాష్ట్ర చైర్మన్ మార్కా రాజేంద్ర ప్రసాద్ యాదవ్, సర్పంచులు, డీసీసీ నాయకులు, అనుబంధ సంఘాల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

ఎంప్లాయిస్ యూనియన్ ద్వారానే ఆర్టీసీ కార్మికుల హక్కులు సాధ్యం

బోగే ఉపేందర్

ఎన్నికల్లో బస్ గుర్తుకు ఓటు వేయాలని పిలుపు

ఆసిఫాబాద్ సెప్టెంబర్ 19: కొమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా ఆర్టీసీ కార్మికుల హక్కులు ఎంప్లాయిస్ యూనియన్ (ఏఐటియుసి) ద్వారానే సాధ్యమని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి బోగే ఉపేందర్ పేర్కొన్నారు. శనివారం ఆసిఫాబాద్ డిపోలో ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో గేట్ మీటింగ్ నిర్వహించారు. గత పాలకుల నిర్లక్ష్యం వల్ల ఆర్టీసీ నష్టాల్లోకి వెళ్లిందని, విలీనం చేస్తామని హామీ ఇచ్చిన ప్రభుత్వం మూడేళ్లలో కార్మికులను మోసం చేసిందని, బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయడం, ఉద్యోగ భద్రత కల్పించడం, అధికారుల వేధింపులు తగ్గించడం, పెండింగ్‌లో ఉన్న పీఆర్సీ, సీసీఎస్ బకాయిలు ఇప్పించడం వంటి డిమాండ్లను ప్రస్తావించారు. 2017, 2021 పీఆర్సీ బకాయిలు, 2025 వేతన సవరణ, గ్యారేజీ కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు. ఎన్నికల్లో బస్ గుర్తుకు ఓటు వేసి భారీ మెజారిటీతో గెలిపించాలని కార్మికులను కోరారు.

వంజిరిలో స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ

ఆసిఫాబాద్ సెప్టెంబర్ 19: కాగజ్‌నగర్ మండలంలోని వంజిరి గ్రామపంచాయతీ పరిధిలో అర్హులైన రేషన్ లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డులను పంపిణీ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన కొత్త స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమంలో భాగంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. కొత్త స్మార్ట్ రేషన్ కార్డులు పీవీసీ రూపంలో ఉండటంతో పాటు క్యూఆర్ కోడ్ వంటి ఆధునిక సదుపాయాలను కలిగి ఉంటాయని ప్రభుత్వం తెలిపింది. రాష్ట్రవ్యాప్తంగా సుమారు 1.05 కోట్ల కుటుంబాలకు స్మార్ట్ రేషన్ కార్డులను అందించే కార్యక్రమాన్ని ఆగస్టు 15న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రారంభించారు. వంజిరిలో జరిగిన కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ లక్ష్మి, ఉపసర్పంచ్ భరత్, రేషన్ డీలర్ లీలా, గ్రామస్థులు, రేషన్ లబ్ధిదారులు పాల్గొన్నారు. అర్హులైన ప్రతి కుటుంబానికి ప్రభుత్వం అందిస్తున్న రేషన్ సౌకర్యాలు సక్రమంగా అందేలా చర్యలు తీసుకోవాలని ఈ సందర్భంగా పలువురు కోరారు.

జానపద కళారంగంలో ప్రతిభకు గుర్తింపు.. సింగరేణి సెక్యూరిటీ గార్డుకు డాక్టరేట్

మందమర్రి, సెప్టెంబర్ 19: సింగరేణి ఉద్యోగిగా విధులు నిర్వహిస్తూనే జానపద కళారంగంలో తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న మందమర్రికి చెందిన కే.ఆర్. సంపత్‌కు అరుదైన గౌరవం దక్కింది. మందమర్రి ఎస్అండ్‌పీసీ విభాగంలో సీనియర్ సెక్యూరిటీ గార్డుగా పనిచేస్తున్న సంపత్ జానపద నృత్యరంగంలో అందించిన సేవలు, సాధించిన విజయాలను గుర్తించి డాక్టరేట్‌తో సత్కరించారు. తమిళనాడులోని పుదుచ్చేరిలో నిర్వహించిన కార్యక్రమంలో యునైటెడ్ నేషన్స్ ఇంటర్నేషనల్ పీస్ కౌన్సిల్ (జర్మనీ) ప్రతినిధుల చేతుల మీదుగా సంపత్ డాక్టరేట్ అందుకున్నారు. జానపద నృత్య కళాకారుడిగా ఆయన అనేక ప్రదర్శనలు ఇస్తూ పలు విజయాలు సాధించారు. ఇటీవల కోల్ ఇండియా స్థాయిలో నిర్వహించిన ఫోక్ డాన్స్ పోటీల్లో గోల్డ్ మెడల్ సాధించడం విశేషం. సింగరేణిలో విధులు నిర్వహిస్తూ మరోవైపు జానపద కళను ప్రోత్సహిస్తూ జాతీయ స్థాయిలో గుర్తింపు పొందడం పట్ల సహచర ఉద్యోగులు, కళాభిమానులు హర్షం వ్యక్తం చేశారు.

గర్భిణులపై ఎయిర్ పొల్యూషన్ ఎఫెక్ట్..

పుట్టబోయే బిడ్డపై ప్రభావం చూపుతుందా?

కాలుష్యం ప్లాసెంటా ద్వారా శిశువుకు చేరి ఇన్‌ఫ్లమేషన్, ఆక్సిడేటివ్ స్ట్రెస్‌ను కలిగించి మెదడు వికాసాన్ని ప్రభావితం చేస్తుంది!

గర్భధారణ సమయంలో వాయు కాలుష్యానికి గురయ్యే అవకాశం ఉన్న పరిస్థితుల్లో నివాసం ఉంటున్నవారు జాగ్రత్త! ఎందుకంటే.. ఇది తల్లి ఆరోగ్యంతో పాటు పుట్టబోయే బిడ్డ మెదడు అభివృద్ధిపై కూడా ప్రతికూల ప్రభావం చూపే అవకాశం ఉందని జర్నల్‌లో ప్రచురితమైన అధ్యయనం వెల్లడించింది. ముఖ్యంగా నైట్రోజన్ డయాక్సైడ్ 2.5 (ఫైన్ పార్టిక్యులేట్ మ్యాటర్), బ్లాక్ కార్బన్ వంటి కాలుష్యాలు శిశువు మెదడు నిర్మాణంలో స్వల్ప మార్పులకు కారణమవుతాయని పరిశోధకులు గుర్తించారు. బార్సిలోనా దీఊజ ప్రాజెక్ట్ ఆధారంగా సుమారు 754 గర్భిణులపై నిర్వహించిన ఈ అధ్యయనంలో, రెండవ మూడవ త్రైమాసికాల్లో కాలుష్య బారిన పడిన వారి శిశువుల మెదడు స్ట్రక్చర్‌లను ట్రాన్స్‌వాజినల్ న్యూరోసోనోగ్రఫీ (ప్రత్యేక అల్ట్రాసౌండ్) ద్వారా పరిశీలించారు. ఫలితంగా మెదడు కుహరాలు (లాటరల్ వెంట్రికల్స్) పెద్దవవడం, సిస్టెర్నా మాగ్నా విస్తరణ, మోటార్ స్కిల్స్‌కు సంబంధించిన ప్రాంతాల్లో మార్పులు వంటివి గమనించబడ్డాయి. ఈ మార్పులు భవిష్యత్తులో శిశువు మెదడు అభివృద్ధి, మోటార్ సామర్థ్యాలు, సెన్సరీ ప్రాసెసింగ్‌పై ప్రభావం చూపవచ్చని నిపుణులు చెబుతున్నారు.

ఇతర ప్రమాదాలు:

వాయు కాలుష్యం గర్భిణుల్లో శ్వాసకోశ సమస్యలు, ఆస్తమా రిస్క్‌ను పెంచుతుంది. కాలుష్యం ప్లాసెంటా ద్వారా శిశువుకు చేరి ఇన్‌ఫ్లమేషన్, ఆక్సిడేటివ్ స్ట్రెస్‌ను కలిగించి మెదడు వికాసాన్ని ప్రభావితం చేస్తుంది. అయితే ఈ మార్పులు సాధారణంగా స్వల్ప స్థాయిలో ఉంటాయి, వ్యక్తిగతంగా పాతాలజికల్ (వ్యాధికర) మార్పులు కావు. ఇక జాగ్రత్తల విషయానికి వస్తే.. గర్భిణులు ట్రాఫిక్ ఎక్కువగా ఉండే ప్రాంతాలు, పొగమంచు రోజుల్లో ఇంటి బయటకు తక్కువగా వెళ్లడం, మాస్క్ ఉపయోగం, ఇంటిని శుభ్రంగా ఉంచడం, ఎయిర్ ప్యూరిఫైయర్ వాడడం వంటి జాగ్రత్తలు తీసుకోవాలని ఆరోగ్య నిపుణులు సూచిస్తున్నారు. నగరాల్లో కాలుష్యాన్ని తగ్గించే పాలసీలు (గ్రీన్ ఎనర్జీ, ట్రాఫిక్ నియంత్రణ) కూడా అవసరమని అభిప్రాయపడుతున్నారు.

గమనిక :

పైవార్తలోని సమాచారం ఇంటర్నెట్ ఆధారంగా సేకరించబడింది. మీ అవగాహన కోసం మాత్రమే అందిస్తున్నాం. అనుమానాలు ఉంటే వైద్య నిపుణులను సంప్రదించగలరు.

అనారోగ్యకరమైన పేగులకు సంకేతాలు ఇవే..

తరచూ కడుపులో ఉబ్బరం, అలసట, చర్మ సమస్యలతో ఇబ్బంది పడుతున్నారా? శరీరంలోని 70% రోగనిరోధక వ్యవస్థ గట్ పైనే ఆధారపడి ఉంటుంది. ప్రేగుల ఆరోగ్యం దెబ్బతిన్నప్పుడు శరీరం హెచ్చరికలు అందిస్తుంది.



తరచూ కడుపులో ఉబ్బరం, అలసట, చర్మ సమస్యలతో ఇబ్బంది పడుతున్నారా? శరీరంలోని 70% రోగనిరోధక వ్యవస్థ గట్ పైనే ఆధారపడి ఉంటుంది. ప్రేగుల ఆరోగ్యం దెబ్బతిన్నప్పుడు శరీరం హెచ్చరికలు అందిస్తుంది. ఇవి కూడా ఇందులో భాగమే కాగా మరిన్ని సంకేతాల గురించి వివరిస్తున్నారు నిపుణులు. గట్ హెల్త్ పూర్తి ఆరోగ్యంపై ప్రభావం చూపుతుంది కాబట్టి జాగ్రత్త ఉండాలని సూచిస్తున్నారు. ఇంతకీ ఆ సంకేతాలేంటి? చూద్దాం.

కడుపు సమస్యలు

కడుపులో ఉబ్బరం, గ్యాస్, గుండెల్లో మంట, అతిసారం లేదా మలబద్ధకం వంటి జీర్ణ సమస్యలు తరచుగా రావడం మంచిది కాదు. ఆహారం జీర్ణం కాకపోవడం లేదా వ్యర్థాలను బయటకు పంపడంలో ఇబ్బంది.. గట్ అనారోగ్యానికి మొదటి సంకేతంగా చెప్తున్నారు నిపుణులు. ఆహారం అసహనం.. అంటే ఫుడ్ టోలరెన్స్.. కొన్ని ఆహారాలు జీర్ణం కాకపోవడం, లేదా మూడ్ స్వింగ్స్, ఆందోళన వంటివి కూడా ఇందులో భాగమే.

నిద్ర సమస్యలు

గట్ హెల్త్ దెబ్బతిన్నప్పుడు ఎప్పుడూ అలసిపోయినట్లు అనిపిస్తుంది. నిద్ర పోవడంలో ఇబ్బందులు తలెత్తుతాయి. గట్‌లోని బ్యాక్టీరియా అసమతుల్యత వల్ల సెరటోనిన్ ఉత్పత్తి ప్రభావితం అవుతుంది. నిద్ర, మూడ్‌ను నియంత్రించే హార్మోన్.. నిద్ర సమస్యలు, అలసటకు దారితీస్తుంది.

బరువులో మార్పు

ఆహారం లేదా వ్యాయామం మార్చకుండానే ఆకస్మికంగా బరువు పెరగడం లేదా తగ్గడం జరుగుతుంది. గట్ మైక్రోబయోమ్ అసమతుల్యత వల్లనే ఇలా జరుగుతుందని చెప్తున్నారు నిపుణులు.

అనుమతులేని క్లినిక్ సీజ్ గంటల్లోనే ఓపెన్...

హయత్‌నగర్, సెప్టెంబర్ 19 (నేటి దిక్సూచి): హయత్‌నగర్ పరిధిలోని జీ ఇంటర్నేషనల్ స్కూల్ సమీపంలో ఉన్న అజయ్ క్లినిక్ వ్యవహారం ప్రస్తుతం చర్చనీయాంశంగా మారింది. రంగారెడ్డి జిల్లా డీఎంహెచ్‌ఓ స్వర్ణకుమారి ఆదేశాల మేరకు డెమో మంజుల అజయ్ క్లినిక్‌ను సీజ్ చేసినట్లు సమాచారం. సీజ్ చేసిన గంటల్లోనే క్లినిక్ తిరిగి తెరుచుకుని కార్యకలాపాలు కొనసాగుతున్నట్లు ప్రచారం జరగడం ఇప్పుడు అంతుచిక్కని ప్రశ్నగా మారింది. అసలు సీజ్ చర్యలు ఎప్పుడు చేపట్టారు? సీజ్ చేసిన అనంతరం క్లినిక్‌ను తిరిగి తెరవడానికి ఎవరి అనుమతి తీసుకున్నారు? అధికారిక అనుమతి ఉంటే దాని వివరాలు ఏమిటి? లేక ఎలాంటి అనుమతి లేకుండానే క్లినిక్ తిరిగి ప్రారంభమైందా? అనే ప్రశ్నలకు సంబంధిత అధికారులు స్పష్టత ఇవ్వాల్సి ఉంది. ఇదిలా ఉండగా క్లినిక్‌లో వైద్య సేవలు అందిస్తున్న వారి అర్హతలు, వైద్య రిజిస్ట్రేషన్, అనుమతులపై కూడా ఫిర్యాదులు ఉన్నట్లు తెలుస్తోంది. చిన్నారులకు చికిత్స, ఇన్‌పేషెంట్ అడ్మిషన్లు వంటి అంశాలపైనా సమగ్ర తనిఖీ చేయాలని స్థానికులు కోరుతున్నారు.

‘లంగ్ క్యాన్సర్’ లక్షణాలు? చేతులు, కాళ్లలో ఎలా ఉంటాయో తెలుసా?

ముందుగానే గుర్తించి అలర్ట్ కావాలంటున్న నిపుణులు

ఊపిరితిత్తుల క్యాన్సర్ కొన్నిసార్లు దగ్గు లేదా బరువు తగ్గడం వంటి సాధారణ లక్షణాల కంటే ముందే, శరీర భాగాల చివరలైన చేతిగోళ్లు, గోళ్లు, మణికట్టు, చీలమండలు, చర్మం, కండరాలు, రక్తనాళాలు లాంటి సంకేతాల ద్వారా బయటపడవచ్చు. వీటిలో ఏవైనా అకస్మాత్తుగా కనిపించినా లేదా తీవ్రమైనా, ఆలస్యం చేయకుండా వెంటనే డాక్టర్?ను సంప్రదించాలంటున్నారు నిపుణులు.

వేళ్లు ఉబ్బడం :

వేలి కొనలు గుండ్రంగా ఉబ్బడం, గోళ్లు కిందికి వంగిపోవడం, గోరు-చర్మం కలిసే కోణం మారడం, వేడిగా అనిపించడం లాంటి లక్షణాలు కనిపిస్తే అప్రమత్తం కావాలంటున్నారు నిపుణులు. ఇది నాన్ స్మాల్ సెల్ లంగ్ క్యాన్సర్?లో కనిపించవచ్చని చెబుతున్నారు.

ఎందుకు నిర్లక్ష్యం చేయవద్దంటే :

వేళ్ల వద్ద అసాధారణ రక్తనాళాలు, కనెక్టివ్ టిష్యూ మార్పులను క్లబ్బింగ్ సూచిస్తుంది. దీనివల్ల ఛాతీ సంబంధిత వ్యాధుల కోసం పరీక్షలు చేయడం అవసరం.

మణికట్టు, చీలమండలలో నొప్పి, వాపు :

ఎముకల నొప్పితో పాటు మణికట్టు, చీలమండల వాపు, ఇన్ఫెమేషన్ ఉండటం అనేది హైపర్ ట్రోపిక్ పల్మనరీ ఆస్టియో ఆర్థ్రోపతీ ని సూచించవచ్చు. ఇది ఊపిరితిత్తుల క్యాన్సర్?కు సంబంధించిన ఒక అరుదైన, ముఖ్యమైన సిండ్రోమ్.

ఎందుకు నిర్లక్ష్యం చేయవద్దంటే :

అనేది ఎముకల పై పొర (పెరియోస్టియల్) మార్పులను, కీళ్ల వాపును సూచిస్తుంది. పెద్దవారిలో ఇది కొత్తగా కనిపిస్తే, డాక్టర్లు తరచుగా ఊపిరితిత్తుల క్యాన్సర్? సంభావ్యతను పరిశీలిస్తారు.

మోకాలి కింది ఎముక :

నడుస్తున్నప్పుడు లేదా పని చేస్తున్నప్పుడు మోకాలి కింద ఎముక లేదా మోచేయి ఎముకలపై తీవ్రమైన నొప్పి లేదా నొక్కినప్పుడు నొప్పి ఉండటం న్యూూ పెరియోస్టిటిస్ వల్ల కావచ్చు. ఇది ఛాతీ లక్షణాలు కనిపించడానికి ముందే రావచ్చు.

ఎందుకు నిర్లక్ష్యం చేయవద్దంటే :

బోన్? స్కాన్ లేదా ఎక్స్?-రే ద్వారా పెరియోస్టియల్ రియాక్షన్?ను గుర్తించవచ్చు. ఈ లక్షణాన్ని ముందుగా గుర్తించడం వల్ల ఛాతీ ఇమేజింగ్, వ్యాధి నిర్ధారణ వేగంగా జరుగుతుంది.

కారణం లేని కాళ్లవాపు, పిక్కల నొప్పి :

ఊపిరితిత్తుల క్యాన్సర్?తో సహా వివిధ క్యాన్సర్?లు రక్తం గడ్డకట్టే ప్రమాదాన్ని పెంచుతాయి. ఒకవేళ ఈ రక్తపు గడ్డ విడిపోయి, రక్తప్రవాహం ద్వారా ఊపిరితిత్తులకు చేరుకుంటే, అది పల్మనరీ ఎంబోలిజం అనే ప్రాణాంతక పరిస్థితికి దారితీస్తుంది. కాబట్టి, కొత్తగా ఒకే వైపు కాలు వాపు, వేడి, పిక్కలలో నొప్పి లాంటి లక్షణాలు కనిపించవచ్చు.

ఎందుకు నిర్లక్ష్యం చేయవద్దంటే :

సిరల్లో రక్తం గడ్డకట్టడం అనేది క్యాన్సర్ ప్రారంభ సంకేతం కావచ్చు. తక్షణ ఇమేజింగ్, రక్తాన్ని పలచబరిచే చికిత్స ప్రాణాంతక సమస్యలను తగ్గిస్తుంది.

పారానీయోప్లాస్టిక్ మయోసైటిస్(తొడలు, భుజాల కండరాల బలహీనత) :

మెట్లు ఎక్కడం, కుర్చీలో నుంచి లేవడం, చేతులు పైకెత్తడం వంటి పనులలో ఇబ్బంది కలిగించే క్రమరహిత, రెండు వైపులా ఉండే ప్రాక్సిమల్ కండరాల బలహీనత పారానీయోప్లాస్టిక్ డెర్మటోమయోసైటిస్ లేదా పాలిమయోసైటిస్ వల్ల సంభవించవచ్చు.

ఎందుకు నిర్లక్ష్యం చేయవద్దంటే :

పెద్దవారిలో కొత్తగా ఇన్?ఫ్లమేటరీ మయోపతి కనిపిస్తే క్యాన్సర్ వచ్చే ప్రమాదం ఎక్కువగా ఉంటుంది. ఊపిరితిత్తుల క్యాన్సర్? దీనితో సంబంధం కలిగి ఉన్నందున నిర్దేశిత స్క్రీనింగ్ అవసరం.

చేతులు, కాళ్లపై డెర్మటోమయోసైటిస్ చర్మ సంకేతాలు :

వేలి కణుపులపై గాట్రాన్ పాపుల్స్ వేళ్లపై పొలుసులుగా ఉండే ఎర్రటి మచ్చలు, కనురెప్పలపై ఊదారంగు, మోచేతులపై దద్దుర్లను గమనించండి. ఇవి క్యాన్సర్ నిర్ధారణకు ముందే కనిపించవచ్చు.

ఎందుకు నిర్లక్ష్యం చేయవద్దంటే :

డెర్మటోమయోసైటిస్ అనేది గుర్తించబడిన పారానీయోప్లాస్టిక్ సిండ్రోమ్. పెద్దవారిలో దీని బారిన పడిన 10-25 శాతం మందికి క్యాన్సర్ ఉండే అవకాశం ఉంది. ఇందులో తరచుగా ఊపిరితిత్తుల క్యాన్సర్ కూడా ఉంటుంది.

చేతులు, కాళ్లలో తిమ్మిరి, మంటలు :

డయాబెటిస్ లేదా విటమిన్ బి 12 లోపం లేకపోయినప్పటికీ కాళ్లు, చేతుల చివర్లలో కొత్తగా తిమ్మిర్లు, మంటలు రావడం, స్మాల్ సెల్ లంగ్ క్యాన్సర్?లోని పారానీయోప్లాస్టిక్ నరాల ప్రక్రియలను ప్రతిబింబిస్తుంది.

ఎందుకు నిర్లక్ష్యం చేయవద్దంటే :

పారానీయోప్లాస్టిక్ యాంటీబాడీస్, సైటోకైన్లు నరాలను దెబ్బతీస్తాయి. ఇతర శారీరక లక్షణాలతో పాటు నరాల బలహీనత సంకేతాలు ఉంటే క్యాన్సర్ పరీక్షలు చేయించుకోవాలి.

మనసు, శరీరాన్ని ఇలా రీఛార్జ్ చేద్దాం!

ఒత్తిడి, నిస్సత్తువను జయించాలా? – ఈ మూడు బ్యాటరీలను ఫుల్? చేసుకోవాలంటున్న నిపుణులు

ఇప్పుడున్న పరిస్థితుల్లో జీవితం అనేది ఉరుకులు, పరుగులతో గడిచిపోతోంది. తినడానికి సరిగ్గా టైం కూడా దొరకడం లేదు. దీంతో చాలా మంది ఎదుర్కొనే అతిపెద్ద సమస్యల్లో తీవ్రమైన అలసట ఒకటి. రోజంతా ఏదో పనితో సతమతమవుతూ నిస్సత్తువగా మారిపోతున్నాం. ఈ అలసట, ఒత్తిడిని జయించాలంటే మనలోని మూడు బ్యాటరీలను రీఛార్జ్ చేసుకోవాలంటున్నారు మానసిక నిపుణులు. మానసిక బ్యాటరీ ఇది డౌన్ అయితే.. మనకు ఆలోచనలు సరిగ్గా రావు. చిన్న పనులైనా గందరగోళంగా అనిపిస్తాయంటున్నారు నిపుణులు. భావోద్వేగ బ్యాటరీ ఇది బలహీనపడితే ఉద్వేగాలపై నియంత్రణ ఉండదని చెబుతున్నారు. మనసు ఎప్పుడూ చిరాకుగా ఉంటుందని పేర్కొంటున్నారు. శారీరక బ్యాటరీ ఇది అయిపోతే చిన్న పనిచేసినా ఒళ్లు నొప్పులు, తీవ్ర అలసట అనిపిస్తుందని వివరిస్తున్నారు.

మనసుకు శక్తి కోసం :

విజయాల జాబితా : కొంతమంది ఎప్పుడూ సాధించలేని వాటి గురించే ఆలోచిస్తూ నిరాశ చెందుతుంటారు. అలా కాకుండా, ఇప్పటి వరకు సాధించిన విజయాలను పుస్తకంలో రాసుకోవాలంటున్నారు నిపుణులు. ఇది ఆత్మ విశ్వాసాన్ని పెంచుతుందని చెబుతున్నారు.

గతాన్ని వదిలేయండి :

‘గతం గతః’ అని పెద్దలు చెబుతుంటారు. అందుకే, గతంలో జరిగిన వాటి గురించి ఆలోచించి మనసు పాడు చేసుకోవడం కంటే.. వాటి నుంచి ఏం నేర్చుకున్నామో తెలుసుకొని ముందుకు వెళ్లడం మంచిదని సూచిస్తున్నారు.

మొబైల్?ఫోన్?కు దూరంగా :

నిరంతరం మొబైల్ ఫోన్, సోషల్? మీడియాలతో గడపడం వల్ల మానసిక ఆందోళనలు పెరుగుతున్నాయంటున్నారు నిపుణులు. అందుకే, రోజులో కొంత సమయం వీటికి పూర్తిగా దూరంగా ఉండాలని సూచిస్తున్నారు. నిద్రపోవడానికి రెండు గంటల ముందు ఫోన్?ను చూడవద్దని సలహా ఇస్తున్నారు. అలాగే, పడక గది వాతావరణం ప్రశాంతంగా, హాయిగా ఉండేలా చూసుకోవాలని చెబుతున్నారు.

సృజనాత్మకతకు పదును :

పెయింటింగ్ వేయడం, నచ్చిన సంగీతం వినడం, పుస్తకం చదవడం, డైరీ రాసుకోవడం లాంటివి మెదడుకు విశ్రాంతినిస్తాయని నిపుణులు పేర్కొంటున్నారు.

భావోద్వేగాలు నియంత్రణలో :

నెగెటివ్ ఆలోచనలు వద్దు మనల్ని కుంగదీసే వ్యక్తులకు, చెడు ఆలోచనలు రేకెత్తించే పరిస్థితులకు వీలైనంత దూరంగా ఉండాలంటున్నారు నిపుణులు.

సన్నిహితులతో : నచ్చిన వారితో, స్నేహితులు, కుటుంబ సభ్యులతో కాసేపు గడపడం వల్ల మానసిక ప్రశాంతత లభిస్తుందని నిపుణులు చెబుతున్నారు.

ధ్యానం ప్రశాంతమైన చోట కూర్చొని మనసును శ్వాసపై కేంద్రీకరించాలని నిపుణులు సూచిస్తున్నారు. కోపం, బాధ లాంటి భావోద్వేగాలు ఏర్పడినప్పుడు కంగారు పడకుండా ప్రశాంతంగా వాటిని విశ్లేషించడం అలవాటు చేసుకోవాలని సలహా ఇస్తున్నారు. మొబైల్ ఫోన్లు, ల్యాప్?టాప్?, కంప్యూటర్లకే కాదు.. శరీరం, మనసును కూడా రీసెట్ చేసుకోవడం చాలా ముఖ్యం. కాబట్టి, రోజువారీ అలవాట్లలో చిన్నచిన్న మార్పులు చేసుకోవడం అవసరం. దీనివల్ల వ్యక్తిగత బ్యాటరీలను రీఛార్జ్ చేసుకోవచ్చు. ఇలాంటి జాగ్రత్తలు అన్నీ తీసుకున్నప్పటికీ ఎప్పుడూ అలసటగా అనిపిస్తుంటే ఆలస్యం చేయకుండా డాక్టర్లను సంప్రదించాలి. ఎందుకంటే, కొన్ని రకాల శారీరక లోపాలు, ఒత్తిడి లాంటి మానసిక సమస్యలు కూడా సుదీర్ఘ అలసటకు కారణం కావొచ్చు- డాక్టర్ వంగీపురం, శ్రీనాథాచారి, కన్సల్టెంట్ సైకాలజిస్ట్

శరీరానికి ఇంధనం :

గోరువెచ్చని స్నానం : రోజంతా అలసిపోయిన తర్వాత ‘ఎప్సమ్ సాల్ట్’ వేసిన గోరువెచ్చని నీటితో స్నానం చేయాలంటున్నారు నిపుణులు. దీంతో కండరాల నొప్పులు తగ్గి శరీరం తేలికపడుతుందని చెబుతున్నారు. సమతులాహారం : శరీరంలో శక్తి కోసం చక్కెర, ఉప్పు, నూనె తగ్గించుకోవాలంటున్నారు నిపుణులు. వీటికి బదులుగా తృణధాన్యాలు, ఆకుకూరలు, ప్రొటీన్లు ఉన్న పోషకాహారం తీసుకోవాలని సూచిస్తున్నారు. వ్యాయామం : అలసటగా ఉందని సోఫాలో పడుకోవడం కంటే.. కాసేపు వాకింగ్ లేదా వ్యాయామం చేయడం వల్ల ఎండార్ఫిన్లనే హార్మోన్లు విడుదలై శరీరానికి కొత్త ఉత్సాహాన్నిస్తాయంటున్నారు నిపుణులు.

నిద్ర :

రోజుకు 7-9 గంటలపాటు ప్రశాంతంగా నిద్రపోవడం చాలా ముఖ్యమంటున్నారు నిపుణులు. ఇది మెదడు పనితీరును మెరుగుపరుస్తుందని పేర్కొంటున్నారు. ఇక్కడ మీకు అందించిన ఆరోగ్య సమాచారం, సూచనలు అన్నీ మీ అవగాహన కోసం మాత్రమే. శాస్త్ర పరిశోధనలు, అధ్యయనాలు, వైద్య, ఆరోగ్య నిపుణుల సూచనల ప్రకారమే మేము ఈ సమాచారాన్ని అందిస్తున్నాం. కానీ,

“డయాబెటిస్” కంటి చూపును ప్రభావితం చేస్తుందా? పరిశోధనలు ఏం చెప్తున్నాయి?

మధుమేహంతో వచ్చే సమస్యలెన్నో – కళ్లను జాగ్రత్తగా చూసుకోవాలంటున్న నిపుణులు!

ప్రస్తుతం వయస్సుతో సంబంధం లేకుండా ప్రతి ఒక్కరిని ఇబ్బంది పెడుతున్న ఆరోగ్య సమస్యల్లో మధుమేహం ఒకటి. ఒకసారి దీని బారిన పడ్డామంటే.. నియంత్రణలో ఉంచుకోవటం తప్పించి, చేయగలిగిందేమీ లేదు. అయితే, ఇది అదుపులో లేకపోతే కళ్లను నిశ్శబ్దంగా దెబ్బతీస్తుందంటున్నారు నిపుణులు. రక్తంలో గ్లూకోజ్ స్థాయిలు రెటినాలోని చిన్న రక్తనాళాలను దెబ్బతీస్తాయని, ఇది డయాబెటిక్ రెటినోపతి, ఇతర దృష్టి సమస్యలకు దారితీస్తుందని హెచ్చరిస్తున్నారు. ఈ క్రమంలో డయాబెటిక్ రెటినోపతి బారిన పడినప్పుడు కొన్ని లక్షణాలు కనిపిస్తాయని సూచిస్తున్నారు. వాటిని ఎప్పుడూ నిర్లక్ష్యం చేయవద్దని సలహా ఇస్తున్నారు. మరి, అవేంటో ఇప్పుడు తెలుసుకుందాం!

మసకబారిన దృష్టి :

కొందరికి అకస్మాత్తుగా కంటి చూపు మసకబారడం లేదా చేసే పనిపై దృష్టి పెట్టలేకపోతుంటారు. ఇది కేవలం కంటి అలసట వల్ల మాత్రమే కాకపోవచ్చని నిపుణులు అంటున్నారు. రక్తంలో గ్లూకోజ్ స్థాయిలలో మార్పులు కంటిలోని లెన్స్ వాపుకు దారితీయవచ్చని చెబుతున్నారు. దీనివల్ల కంటి చూపు తగ్గిపోతుందని తెలియజేస్తున్నారు. అయితే, వివిధ కారణాల వల్ల అప్పుడప్పుడు దృష్టి మసకబారవచ్చుట. కానీ, డయాబెటిస్ ఉన్న వారిలో దృష్టి మసకబారడం అనేది డయాబెటిక్ రెటినోపతి అభివృద్ధిని లేదా మాక్యులర్ ఎడెమా సమస్యను సూచించే లక్షణాలలో ఒకటని వివరిస్తున్నారు. రెటీనా రక్తనాళాల నుంచి ద్రవం లీక్ అవ్వడం వల్ల, కేంద్ర దృష్టికి బాధ్యత వహించే మాక్యులాలో ఎడెమా ఏర్పడి, తద్వారా దృష్టి లోపానికి దారితీయవచ్చని పేర్కొంది.

ఫ్లోటర్స్ లేదా నల్లటి మచ్చలు :

దృష్టిలో తేలియాడే చిన్న, నల్లటి లేదా బూడిద రంగు చుక్కలు, దారాలు లేదా సాలీడు గూడు వంటి నిర్మాణాలను ‘ఫ్లోటర్స్’ అంటారు. అయితే, డయాబెటిక్ కంటి వ్యాధిలో ఇవి కనిపించవచ్చని పేర్కొంది. ఇక్కడ దెబ్బతిన్న రక్తనాళాల నుంచి కంటిలోకి ద్రవం లీక్ అవ్వడం లేదా రక్తస్రావం కావడం జరుగుతుందంటున్నారు. ఇవి ‘విట్రస్ హెమరేజ్’ ప్రారంభాన్ని సూచిస్తాయని పేర్కొంటున్నారు. ఈ సమస్యను నిర్లక్ష్యం చేయకుండా చికిత్స తీసుకోవాలని సూచిస్తున్నారు.

రాత్రివేళల్లో చూడటం కష్టమవ్వడం :

రాత్రిపూట సరిగ్గా కనిపించకపోవడం లేదా చదివేటప్పుడు ఎక్కువ వెలుతురు అవసరం కావడం వంటివి ప్రారంభ రెటినా నష్టానికి సంకేతాలు కావచ్చని నిపుణులు చెబుతున్నారు. డయాబెటిస్ వల్ల రెటినా సామర్థ్యంపై ప్రభావం పడుతుందని అంటున్నారు. తద్వారా తక్కువ వెలుతురులో దేనినైనా గుర్తించడం కష్టమవుతుందని వివరిస్తున్నారు. ఇది ప్రారంభ డయాబెటిక్ రెటినోపతి లేదా శుక్లాలు రెండింటికీ సంకేతం కావొచ్చని తెలియజేస్తున్నారు.

మారే దృష్టి సామర్థ్యం :

ఒకరోజు అన్ని వస్తువులు స్పష్టంగా కనిపిస్తాయి. మరుసటి రోజుకి మళ్లీ దృష్టి మసకబారతుంది. ఈ సమస్య ఎక్కువగా రక్తంలో చక్కెర స్థాయిల హెచ్చుతగ్గులతో ముడిపడి ఉంటుందని నిపుణులు చెబుతున్నారు. ఇది కంటి లెన్స్? ఆకారంలో స్థిరత్వం లేకుండా చేస్తుందట. ఇది కంటి ఆరోగ్యానికి హానిచేయనిదిగా అనిపించినప్పటికీ.. తరచుగా జరిగే మార్పులు కళ్లపై ఒత్తిడిని కలిగిస్తాయంటున్నారు. ఇది రెటినాకు అంతర్గతంగా నష్టం జరుగుతుందని తెలియజేస్తున్నారు.

పాక్షిక దృష్టిలోపం లేదా బ్లైండ్ స్పాట్స్ :

దృష్టిలో కొన్ని భాగాలు అకస్మాత్తుగా కనిపించకుండా పోయినా, చూపులో నల్లటి లేదా ఖాళీ ప్రాంతాలను గమనించినా.. రెటినాలోని కొన్ని ప్రాంతాలకు తగినంత రక్త సరఫరా అందడం లేదని నిపుణులు చెబుతున్నారు. దీనికి చికిత్స తీసుకోకపోతే శాశ్వత దృష్టి లోపానికి దారితీయవచ్చని అంటున్నారు. దృష్టిలో కొంత భాగాన్ని కమ్మేసిన చీకటి నీడ, ఒక తెరలాగా ఉంటుందని పేర్కొంది. ఇక్కడ మీకు అందించిన ఆరోగ్య సమాచారం, సూచనలు అన్నీ మీ అవగాహన కోసం మాత్రమే. శాస్త్ర పరిశోధనలు, అధ్యయనాలు, వైద్య, ఆరోగ్య నిపుణుల సూచనల ప్రకారమే మేము ఈ సమాచారాన్ని అందిస్తున్నాం. వీటిని పాటించే ముందు కచ్చితంగా మీ వ్యక్తిగత వైద్యుల సలహాలు తీసుకోవడమే మంచిది.

Printed , Published and Owned by POLAGONI ALIVELU, and Printed at Smilys Online, 6-7-48, Vanasthalipuram, Shopping Complex, Rangareddy-500070. Telangana State and Published from 17-10-25, Plot No.H.No. 4-136/12, Turkayamjal Journalist Colony, Rangareddy501510, Telangana State. Editor: POLAGONI ALIVELU. PRGI No. TGTEL/25/A3190. Phone No: +91 7989151815